# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 157 | హైదరాబాద్ | గురువారం 11-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

భారతీయ టెక్కీలకు కొత్త కష్టాలు.. హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్లు వాయిదా



## యునెస్కో వారసత్వ పండుగగా
# 'దీపావళి'.. ప్రధాని మోదీ హర్షం

- యునెస్కో వారసత్వ జాబితాలో దీపావళికి చోటు
- భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పులకించిపోతున్నారన్న ప్రధాని
- భారత సంస్కృతికి అపూర్వమైన గుర్తింపు లభిస్తోందన్న కేంద్ర మంత్రి షెకావత్
- ఈ జాబితాలో చేరిన 16వ భారతీయ సాంస్కృతిక అంశంగా దీపావళి

11లో

## స్టార్టప్‌లకు
# రూ.1000 కోట్లు..
## సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన


11లో

- తెలంగాణ స్టార్టప్‌ల కోసం రూ.1000 కోట్ల నిధి ఏర్పాటు
- హైదరాబాద్ టీ-హబ్‌లో 'గూగుల్ ఫర్ స్టార్టప్' హబ్ ప్రారంభం
- రాష్ట్రంలో 100 యూనికార్న్ కంపెనీలు రావాలన్నదే లక్ష్యమన్న సీఎం రేవంత్
- స్టార్టప్‌లకు అండగా తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ సంయుక్త ప్రణాళిక



## అమీర్‌పేట కోచింగ్ సెంటర్‌లో
# అగ్నిప్రమాదం...

- విద్యార్థులందరూ సురక్షితంగా బయటపడటంతో తప్పిన పెను ప్రమాదం


11లో

## మోదీ, రాహుల్ గాంధీ మధ్య
## 88 నిమిషాల భేటీ

- సీఐసీ, ఇతర కమిషనర్ల నియామకాలపై ప్రధానంగా చర్చ
- ప్రభుత్వ ప్రతిపాదనలన్నింటికీ అభ్యంతరం తెలిపిన రాహుల్


11లో

## అగ్రికల్చర్..
# ఎక్విప్‌మెంట్ బ్యాంక్..
## సీఎం చంద్రబాబు వినూత్న నిర్ణయం


11లో


- సాగు వ్యయం తగ్గించేలా అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంకుల ఏర్పాటు
- పత్తి కొనుగోళ్లలో సీసీఐ తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం
- ధరలు పడకుండా హార్వెస్టింగ్ ప్రక్రియలో రేషనలైజేషన్ విధానం
- ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగుకు ప్రోత్సాహం


11లో

## తిరుమలలో మరో భారీ స్కామ్..
## పట్టు శాలువాల పేరుతో
# పాలిస్టర్ దందా..

- మల్బరీ పట్టుకు బదులు పాలిస్టర్ శాలువాల సరఫరా
- పదేళ్లుగా నాసిరకం శాలువాలు అందిస్తున్న సంస్థపై ఆరోపణలు
- విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూసిన భారీ మోసం
- కుంభకోణంపై ఏసీబీ విచారణకు టీటీడీ తీర్మానం

## నగర శివారు ప్రాంతాల్లో
# ఇళ్ళు కట్టుకుంటున్నారా..?




సొంతింటి నిర్మాణం సామాన్యులకు ఒక కల.. ఆ కలను నెరవేర్చుకునేందుకు ఎన్నెన్నో తంటాలు పడుతుంటారు.. రూపాయి, రూపాయి కూడగట్టుకుని ఎలాగైనా ఒక గూడు ఏర్పాటు చేసుకోవాలనుకుంటారు.. గృహ నిర్మాణానికి స్థలం కొనుగోలు ఒక ఎత్తు అయితే.. నిర్మాణం మరొక ఎత్తు.. లేబర్ చార్జీలు ఒకవైపు, మెటీరియల్ చార్జెస్ మరోకవైపు.. ఇది కాకుండా ప్రభుత్వం నుంచి తెచ్చుకోవాల్సిన అనుమతులు.. ఇవన్నీ ఒక సామాన్యుడికి తాను మించిన భారం అవుతోంది.. వీటిని అరికట్టడానికి ప్రభుత్వాలు రకరకాల నిర్ణయాలు, రకరకాల పద్ధతులు అమల్లోకి తీసుకుని వస్తుంటారు.. అదే కోవలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బిల్డ్ నౌ అనే యాప్ ని తీసుకుని వచ్చింది.. కానీ నిర్వహణలో ఎన్నెన్నో లోపాలు కనిపించడంతో నిర్మాణదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. అయితే ఇప్పుడు జీ.హెచ్.ఎం.సి. విస్తృతం అయ్యే ప్రక్రియలో గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్డ్ నౌ లో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.. ఈ క్రమంలో నగర శివారు ప్రాంతాల్లో గృహనిర్మాణాలు చేపట్టేవారికి కొంతమేర కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు..

12లో

భారతశక్తి

# నినాదంగా అవినీతి అంతం

భారతదేశంలో అవినీతి అన్ని రంగాల్లో, అన్ని రకాల సేవల్లో పేరుకుపోయింది. రేషన్ కార్డ్ పొం దడం నుంచి పరిశ్రమల స్థాపన వరకు అన్నిచోట్ల చేయి తడపాల్సిన దుస్థితి ఏర్పడింది. చిన్న చిన్న పనులు చేసే కాంట్రాక్టర్లకు తమ పనులు జరగాలంటే అవినీతి అనే ఆయుధాన్ని ఉపయోగించాల్సిందే. ప్రభుత్వ సేవలందించే ఉద్యోగులు.. వారి సేవలు పొందే ప్రజల మధ్య అవినీతి రాజ్యమేలుతుంది.ప్రభుత్వం ఉచితంగా అందించే విద్య, వైద్య సేవల్లోనూ లంచం ఇవ్వందే పనులు జరగడం లేదు. అవినీతికి పాల్పడిన అధికారులను శిక్షించే చట్టాలు ఉ న్నప్పటికీ, హెచ్చరికలు చేస్తున్నప్పటికీ సమాజంలో అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. అవినీతి, అధికారం ఒకే నాణేనికి రెండు ముఖాలుగా మారిపోయాయి. ప్రపంచమంతటా పేరుకున్న అవినీతి, దాని నిర్మూలనకు ఉన్న చట్టాలపై కనీస అవగాహన, తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించడం జరుగుతుంది. 2003, అక్టోబర్ 31న ఐక్యరాజ్యసమితి అవినీతి వ్యతిరేక ఒప్పందాన్ని ఆమోదించింది. దానిపై సమితిలోని 190 సభ్యదేశాలు సంతకాలు చే యడంతో ప్రపంచంలో అవినీతిపై పోరాటాన్ని చట్టపరమైన విధిగా పరిగణించడం మొదలైంది.ఇదే సదస్సులో ప్రతి ఏడాది డిసెంబర్ 9న ప్రపంచవ్యాప్తంగా 'అవినీతి వ్యతిరేక దినోత్సవం' జరపాలని ఐరాస నిర్ణయించింది. ప్రపంచంలో అవినీతి లేని దేశం, రం గం లేకపోవడాన్ని ఊహించలేం. అవినీతి అనేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక క్యా న్సర్ ముప్పుగా మారింది. పేదల అభివృ ద్ధి కోసం అమలుచేసే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందని స్థితి నెలకొన్నది. వారి అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాల్లో అవినీతి ఉన్న కారణంగా ఆశించిన ఫలితాలు రావడం లేదు. పేదవర్గాల జీవన ప్రమాణాలు, కొనుగోలు శక్తి పెరగక 'సామాన్యుని సాధికారిత' అనేది ఒక కలగానే మిగిలిపోతున్నది.అవినీతి నిర్మూలనకు వ్యతిరేకంగా మన దేశంలో ప్రభుత్వాలు, ఎన్జీఓలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా అవినీతి వ్యతిరేక పోరాటాలు చేసినప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. ఈ ఏడాది అవినీతి సూచీలో భారత్ ర్యాంకు మరింత దిగజారడమే దీనికి ఉ దాహరణ. ప్రపంచ దేశాల అవినీతి సూచీలో భారత్ స్థానం అంతకంతకూ దిగజారుతుండడం ఆందోళన కలిగించే అంశమని చెప్పొచ్చు.ప్రభుత్వ స్థాయిలో అవినీతి ఏ మేరకు రాజ్యమేలుతుందనేది నిపుణులు, వ్యాపారవేత్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' అనే సంస్థ సున్నా నుంచి 100 పాయింట్లను కేటాయిస్తుంది. సున్నా అయితే అవి నీతి ఎక్కువని, 100 అంతకంటే ఎక్కువగా ఉంటే అవినీతి రహితమని పేర్కొంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రాన్స్‌పరెన్సీ ఇం టర్నేషనల్ సంస్థ వెల్లడించిన అవినీతి సూచీకి సంబంధించి 180 దేశాలపై సర్వే నిర్వహించింది.ఈ అధ్యయనంలో భారత్ 38 పాయింట్లతో 96వ స్థానంలో నిలిచింది. 2023లో 39 పాయింట్లతో 93వ స్థానంలో ఉంటే, 2022లో 40 పాయింట్లతో 85వ స్థానంలో నిలవడం గమ నార్హం. తాజాగా భారత్ 96వ స్థానంలో ని లవడం చూస్తుంటే దేశంలో అవినీతి ఏ మేర రాజ్యమేలుతుందనేది అర్థమవుతుంది. అవినీతి చిన్నగా మొదలై ఏడు తలల విషనాగులా మారిపోయింది. ఒక్క భారత దేశంలోనే అవినీతి పుట్టలు కోకొల్లలుగా ఉన్నాయి. ముఖ్యంగా రాజకీయాల్లో ఉ న్నంత అవినీతి మరెక్కడా లేదు. అవినీతి అడ్రస్ రాజకీయాలే. ఇది ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. కనీస మౌలిక వస తులు కూడా ఇవ్వకుండా రోజు రోజుకూ బీదవారిగా మార్చేస్తుంది. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకూ.. దేశాల నుం చి విదేశాల వరకూ అన్ని చోట్లా అవినీతి పంజా విసురుతూనే ఉంది.అవినీతి వల్ల మానవహక్కుల ఉ ల్లంఘన జరుగుతుంది. దీనితో నేరాలు పెరుగుతున్నాయి. పేదరికంలో ఉన్న దేశాల్లో అవినీతి తక్కువగానే ఉన్నప్పటికీ.. అభివృద్ధి చెందుతున్న దేశా ల్లో అవినీతి మాత్రం ఎక్కువగానే ఉంటుం ది. ఒకప్పుడు లంచం తీసుకోవడాన్ని అడ్డుకునే జనం మొన్నటి ఎన్నికల్లో జనం ఏ పార్టీ ఎక్కువ ముట్టజెప్పుతుందో ఆ పార్టీకి మాత్రమే ఓటు వేస్తామని బహిరంగంగా ప్రకటించింది.మరి పార్టీలు కూడా గెలిచాకా ప్రజలకు కష్టపడి సంపాదించుకునే విధానాన్ని మార్చి ఉచితాలను అందిస్తుం ది. దీంతో ఉచితాలకు జనం మరుగుతున్నారు. ఇంతటి తెగింపుకు రావడానికి భా రతదేశంలో పెరిగిపోతున్న అవినీతి మాత్ర మే కారణం. ఒక ఉద్యోగం కొన్న ఉద్యోగి, లంచంతో పని జరిపించుకున్న సామాన్యుడు ఇలా ప్రతి ఒక్కరూ తమ హక్కును కాలరాసి అవినీతి వైపు మొగ్గుచూపుతూనే ఉన్నారుఅదే హక్కుగా భావిస్తున్నారు. ప్ర భుత్వం, ప్రైవేటు ఇలా ఏ రంగం చూసుకు న్నా డబ్బులు ఇవ్వనిదే పని జరగని స్థాయి కి చేరుకుంది. ప్రభుత్వ నిధులు, పాలసీలు, పథకాలు అల్లంత దూరాన ఆగిపోతున్నా యి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే పలు అభివృధి సంక్షేమ పథకాల అమలులో జరుగుతున్న కుంభకోణాలు అవినీతికి అడ్డాగా మారి అభివృద్ధిని అడ్డుకుంటుందనడంలో సందేహం లేదు.అవినీతిని అంతమొందించేందుకు నీతి నిజాయితీ అనే ఉద్యమానికి నడుం కట్టా లి. అవినీతికి వ్యతిరేకంగా దేశంలోని ప్రతి కుటుంబం ఒక యూనిట్‌గా మారాలి. నీతి, నిజాయితీ, మానవీయ విలువలు వంటి అంశాలను పాఠశాల, కళాశాలల స్థాయిలో పాఠ్యాంశంగా చేర్చాలి. అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేసేలా విద్యార్థులకు అవగాహన కలిగించాలి. యువత లో అవినీతి నిర్మూలన చట్టాల మీద సదస్సులు, సమావేశాలు నిర్వహించాలి. నీతి నిజాయితీతో చట్టబద్ధంగా విధులు నిర్వర్తించే ఉద్యోగులను అవార్డులతో సత్కరిం చాలి.ప్రజల్లో ప్రశ్నించే తత్వం.. పాలకుల్లో, అధికారుల్లో జవాబుదారీతనం, పారదర్శకత పెరిగినప్పుడే అవినీతి అంతమయ్యే అవకాశముంటుంది.

# ఇంకా పదవెప్పుడు



విజయవాడ, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

మెగా బ్రదర్ నాగబాబుకి మంత్రి పదవి ఇస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించి ఏడాది అయింది. పోయిన సంవత్సరం సరిగ్గా ఇదే రోజున అంటే 09.12.2024 న ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో పార్టీ అధికారిక లెటర్ హెడ్ పై ఈ ప్రకటన చేశారు. అప్పటికి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో ఒకటి టీడీపీ, ఒకటి జనసేన, మరొకటి బీజేపీ తీసుకుంటాయని ప్రచారం జరిగింది. వాటిలో టీడీపీ నుండి బీద మస్తాన్ రావు, బీజేపీ నుండి ఖీ. కృష్ణయ్య, జనసేన నుండి కొణిదెల నాగబాబు అని అందరూ ఫిక్స్ అయ్యారు.అనూహ్యంగా టీడీపీ నుండి మరోపేరు సాన సతీష్ పేరు సీన్ లోకి రావడం తో టీడీపీ రెండు ఎంపీ స్థానాలు తీసుకొంది. సాన సతీష్ రాజ్యసభ సీటు వెనుకాల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ ఆశీస్సులు ఉ న్నాయన్న ప్రచారం గుప్పుమంది. జగన్ హయాంలో చంద్రబాబు జైలు కి వెళ్ళినప్పుడు ఢిల్లీ వ్యవహారాల్లో లోకేష్ కి అండగా సాన సతీష్ ఉన్నారని అందుకే ఆయనకీ ఆ పదవి దక్కింది అని టీడీపీ లో చాలామంది గుసగుసలాడారు. ఇక నాగబాబు కి రాజ్యసభ సీటు ఖాళీ లేకపోవడం తో ఆయనను మంత్రిమండలి లోనికి తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా లిఖిత పూర్వకం గా ప్రకటించారు. అయితే అది ఇప్పటికీ ఆచరణ లోనికి మాత్రం రాలేదు2019-24 మధ్యలో జనసేన లో నాగబాబు కీలక పాత్ర పోషించారు. 2019 ఎన్నికల్లో నరసాపురం నుండి ఎంపీ గా పోటీ చేసి అప్పటి వైసీపీ ఎంపీ అభ్యర్థి రఘు రామ కృష్ణం రాజు చేతిలో ఓడిపోయారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా 2024 వరకూ పార్టీ తరపున కీలకం గా ఉంటూ వచ్చారు. 2024, ఎన్నికల్లో నరసాపురం నుండి పోటీ చేద్దాం అనుకుంటే అది కూటమి కోసం త్యాగం చెయ్యాల్సి వచ్చింది. అనకాపల్లి నుండి పోటీ అనుకున్నా చివరి క్షణం లో అది బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ కోసం వదిలిపెట్టాల్సి వచ్చింది. మధ్యలో ఎమ్మెల్యే గా పోటీ చేద్దాం అనుకున్నా అదికూడా కుదరలేదు. దానితో రాజ్యసభ కు పంపుదామని పవన్ భావించారు. కానీ అదికూడా సాన సతీష్ కోసం వదలాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వరుసగా నాగబాబుకి హ్యాండ్ ఇస్తూ ఉండడం పై అభిమానుల్లో ఏర్పడ్డ అసంతృప్తి ని చల్లార్చడానికి ఎన్నడూ లేని విధంగా రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన లో భాగం గానే నాగబాబు కి మంత్రి పదవి అంటూ చంద్రబాబు నాయడు స్పష్టత ఇచ్చారు. కానీ ఏడాది దాటినా అది ప్రకటన లానే ఉండిపోయింది. అయితే ఆయన్ను ఎమ్మెల్సీ ని చేసి శాసన మండలి కి పంపారు.ఏపీ క్యాబినెట్ లో ప్రస్తుతం ఒక్క ఖాళీనే ఉంది. దానిని నాగబాబు తో భర్తీ చెయ్యాలని చంద్రబాబు అనుకున్నా చివరి నిముషం లో జన సేనాని పవన్ కళ్యాణ్ పునరాలోచన లో పడ్డారని జనసేన వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే జనసేన నుండి పవన్ కళ్యాణ్, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ మంత్రులు గా ఉన్నారు. వీరిలో పవన్, దుర్గేష్ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. ఇప్పుడు నాగబాబు కి మంత్రి పదవి అంటే ఉన్న నాలుగు మంత్రి పదవుల్లో మూడు ఒకే సామాజిక వర్గానికి ఇచ్చినట్టు అవుతుంది. దానివల్ల జనసేన కు పూర్తిగా కులముద్ర పడిపోయే అవకాశం ఉంటుందని ప్రత్యర్థులకు ఆ అవకాశం ఇవ్వడం ఎందుకు అనేది పవన్ కళ్యాణ్ ఆలోచన గా చెబుతుంటారు ఎనలిస్ట్ లు.ఒకానొక సందర్భంలో పవన్ కూడా ఇండైరెక్ట్ గా ఇదే మాట చెప్పే ప్రయత్నం కూడా చేశారు. దానితో నాగబాబుకు మంత్రి పదవి అనేది రియాలిటీ కి దూరంగా ఉండిపోయింది. మరి త్వరలో జరుగబోతోందిఅని ప్రచారం లో ఉన్న మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణ లో అన్నా నాగబాబు కి మంత్రి పదవి లభిస్తుందా లేదా అన్నది ఏపీ పాలిటిక్స్ లో ఆసక్తి కర చర్చ లా మారింది.

# దీపక్ రెడ్డి అత్యుత్సాహం
## తలంటిన అధిష్టానం

అనంతపురం, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):



జేసీ ప్రభాకర్ రెడ్డి అల్లుడు, టీడీపీ ఎమ్మెల్సీ గుణపాటి దీపక్ రెడ్డికి నోటి దూల ఎక్కువ. అందులోనూ ఆయన పార్టీలో మరింత పట్టు సంపాదించాలనుకున్నారేమో. చినబాబును లోకేశ్ ను ప్రసన్నం చేసుకోవాలన్న తపనతో అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. అయితే చివరకు దీపక్ రెడ్డికి పార్టీ నాయకత్వం తలంటాల్సి వచ్చింది. దీపక్ రెడ్డి టీడీపీ జాతీయ అధికార ప్రతినిధిగా కూడా ఉన్నారు. 2021లో అనంతపురం స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా టీడీపీ తరుపున ఎన్నికయ్యారు. దీపక్ రెడ్డి ఇంకా తన రాజకీయ భవిష్యత్ మెండుగా ఉండాలని భావించినట్లుంది. అందుకే జాతీయ మీడియాలో నారా లోకేశ్ ను ఒక రేంజ్ లో పొగిడేందుకు ప్రయత్నించి నవ్వుల పాలవ్వడమే కాకుండా నాయకత్వం ఆగ్రహానికి కూడా గురయ్యారు.ఒక జాతీయ మీడియా ఛానెల్ లో ఆయన ఇండిగో సంక్షోభం గురించి మాట్లాడుతూ అనవసరంగా నారా లోకేశ్ ప్రస్తావన తెచ్చారు. అర్ణబ్ గోస్వామి అడగక ముందే లోకేశ్ అంతా ఇండిగో సంక్షోభాన్ని మానటరింగ్ చేస్తున్నారంటూ గొప్పలు చెప్పే ప్రయత్నం చేశారు. అది వికటించింది. అసలు నారా లోకేశ్ ఇండిగో సంక్షోభం గురించి పట్టించుకోలేదు. అది ఆయన పని కూడా కాదు. లోకేశ్ అమెరికా, కెనడా పర్యటనకు వెళ్లిపోయారు. కానీ దీపక్ రెడ్డి ఒక అడుగు ముందుకేసి నారా లోకేశ్ వార్ రూమ్ నుంచి ఇండిగో సంక్షోభం నుంచి బయటపడేయటానికి ప్రయత్నించారని అనడంతో అర్ణబ్ గోస్వామి దుమ్ము దులిపేశాడు. లోకేశ్ కు, టీడీపీకి సివిల్ ఏవియేషన్ తో ఏం సంబంధమని ప్రశ్నించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.ఇక ఈ క్లిప్పింగ్ లను పట్టుకుని వైసీపీ నేతలు ఒక ఆటాడుకున్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేరుగా రంగంలోకి దిగారు. ఇండిగో సంక్షోభం కేంద్ర ప్రభుత్వం చూసుకుంటుందని చంద్రబాబు తెలిపారు. ఇండిగో ప్రమాణాలను పాటించలేదని, అందువల్లనే ప్రయాణికులకు అసౌకర్యం కలిగిందని చంద్రబాబు తెలిపారు. తమకు దానితో సంబంధం లేదని తేల్చి చెప్పి నష్ట నివారణ చర్యలు చంద్రబాబు స్వయంగా చేపట్టారు. ఇండిగో సంక్షోభం అంతర్గత విషయమని చంద్రబాబు తేల్చిచెప్పారు. జాతీయ మీడియాలో పార్టీతో పాటు లోకేశ్ పై కూడా విమర్శలు పెద్దయెత్తున రావడంతో దీపక్ రెడ్డికి గట్టిగానే అక్షింతలు పడ్డాయని తెలిసింది. తెలిసి, తెలయకుండా జాతీయ మీడియా ఎదుట మాట్లాడవద్దని, పార్టీ పరువును తీయవద్దంటూ పార్టీ అగ్రనేతలు క్లాస్ పీకినట్లు సమాచారం

## ఒంటిమిట్ట రామాలయానికి
# మహర్ధశ

కడప, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):



పురాతన ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయ అభివృద్ధికి టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా మాస్టర్ ప్లాన్ ను రూపొందించనుంది. ఈ మేరకు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు.ఇదే అంశంపై టీటీడీ ఈవో సింఘాల్ అధికారులతో తాజాగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ?. వచ్చే 50 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ఆరోజు నాటికి భక్తులు రోజుకు ఎంత మంది రావొచ్చు?? ఆలయ పరిసరాలు ఎలా ఉ ండాలి, భక్తులకు సరిపడేలా మౌళిక సదుపాయాలు, వసతి, రవాణా, చారిత్రక నేపథ్యం ఉట్టిపడేలా, ఆధ్యాత్మికత, మరింతగా భక్తులు వచ్చేలా ముందస్తు ప్రణాళికలతో మాస్టర్ ప్లాన్ ను రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.ఇందులో భాగంగా భక్తుల సౌకర్యార్థం కల్యాణకట్ట, పుష్కరిణి, నక్షత్ర వనాలు, గార్డెనింగ్, పచ్చదనం, ఆధ్యాత్మిక చిహ్నాలు, శ్రీ కోదండరామ స్వామి ప్రాశస్త్యం నవతరానికి అందించేలా మ్యూజియమ్, ఉద్యానవనాలు ఏర్పాటవుతాయి. సాంకేతికతను జోడించి డిజిటల్ స్క్రీన్స్ హనుమంతుడి సేవా నిరతి, సాంస్కృతిక కళామందిరం, లైటింగ్, తోరణాలు, చెరువులో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం, నాలుగు మాడ వీధుల అభివృద్ధి, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై మాస్టర్ ప్లాన్ ను రూపొందించాలని సూచించారుమాస్టర్ ప్లాన్ రూపకల్పనలో టీటీడీ విజిలెన్స్, అటవీశాఖ, అన్నదానం, గార్డెనింగ్, ఎలక్ట్రికల్ తదితర శాఖల అధికారులను భాగస్వామ్యం చేసి ఒంటిమిట్ట ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ను తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ డా. అనిల్ కుమార్ మాస్టర్ ప్లాన్ కు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

# పెమ్మసాని కొత్త రికార్డ్

గుంటూరు, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):



జూన్‌లో మోడీ 3.0 ప్రభుత్వంలోని కొత్త మంత్రుల్లో ఆస్తుల పరంగా అతి ధనవంతుడిగా నిలిచిన వ్యక్తి గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ అనే సంగతి తెలిసిందే. ఆయన వెల్లడించిన రూ.5,705 కోట్ల ఆస్తులు అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ప్రస్తుతం గ్రామీణాభివృద్ధి మరియు సమాచార శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పెమ్మసాని మరో విశిష్ట రికార్డు సొంతం చేసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన 25 మంది ఎంపీల పనితీరును పరిశీలించిన ఒక తాజా సర్వేలో పెమ్మసాని 8.9 స్కోర్ సాధించి మొదటి స్థానంలో నిలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కొత్తగా ఎన్నికైన ఎంపీగా, తొలి పదవీకాలంలోనే కేంద్ర మంత్రిగా ఉన్న వ్యక్తి ఇంత మంచి పనితీరు ప్రదర్శించడం ఆశ్చర్యంగా భావిస్తున్నారు.బుర్రిపాలెం లో జన్మించిన పెమ్మసాని ఉస్మానియా యూనివర్సిటీ లో వైద్య విద్య పూర్తిచేసుకుని అమెరికాకు వెళ్లారు. అక్కడ 'యూ వరల్డ్' అనే అంతర్జాతీయ స్థాయి వైద్య విద్యా సంస్థను స్థాపించి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది విద్యార్థులకు మార్గదర్శకుడయ్యారు. 2024 సాధారణ ఎన్నికల సమయంలో అమెరికాలోని స్థిరమైన కెరీర్‌ను విడిచి భారత రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఆయన ధైర్యసాహసాలకు నిదర్శనం.గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన 3,44,695 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించి కొత్త రికార్డు సృష్టించారు. రాజకీయాల్లో కొత్త అయినప్పటికీ ప్రజల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్లమెంటరీ బాధ్యతలు ? ఇవన్నిట్లోనూ ఆయన చూపుతున్న నిబద్ధతే ఈ రికార్డు సాధించే కారణమని విశ్లేషకుల అభిప్రాయం.ఇక అమరావతి రాజధాని ప్రాంతం గుంటూరు ఎంపీ పరిధిలో ఉండటం వల్ల అక్కడి రైతులకు బలమైన మద్దతు అవసరం. ఈ నేపథ్యంలో పెమ్మసాని తరచూ స్థానిక రైతులతో సమావేశమై, వారి సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు. తన ప్రాంత ప్రజల పట్ల ఎలాంటి రాజకీయ స్వార్థం లేకుండా వ్యవహరించడం ఆయనకు మంచి గుర్తింపు తెచ్చింది.అదనంగా, పార్లమెంట్ తొలి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీలు మొత్తం 1,576 ప్రశ్నలను లేవనెత్తగా, అందులో 1,081 ప్రశ్నలు టీడీపీ ఎంపీల నుంచే రావడం గమనార్హం. సగటున ప్రతి టీడీపీ ఎంపీ 77.2 ప్రశ్నలు అడగడం, జాతీయ సగటు 46.8 కంటే చాలా ఎక్కువ. ఈ సంఖ్యలు తమ పనితీరుతో టీడీపీ ఎంపీలు ఎంత చురుకుగా ఉన్నారనే విషయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ సమష్టి కృషిలో పెమ్మసాని చంద్రశేఖర్ ముందంజలో నిలవడం సహజమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాసేవను రాజకీయాల కంటే ముందుగా పెట్టే నాయకత్వం ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టిందనే విషయం ఇప్పుడు మరింత స్పష్టమవుతోంది.

# గోనె సంచెలు ఏవీ...

గుంటూరు, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తన శాఖలో జరిగే విషయాలను పట్టించుకోవడం లేదు. రైతులు గిట్టుబాటు ధర రాకపోవడంతో పాటు గోనెసంచీలు లేక అవస్థలు పడుతున్నారు. వరికి గిట్టుబాటు ధర లభించడం లేదని వాపోతున్నారు. గత ప్రభుత్వం పై విమర్శలు చేయడం మాని నాదెండ్ల మనోహర్ రైతుల గోడును పట్టించుకోవాలని కోరుతున్నారు. దిగుబడి తగ్గడమే కాకుండా, ఖర్చు ఎక్కువయి.. గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. వరికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎకరాకు నలభై నుంచి యాభై బస్తాలు పండాల్సిన వరి, ఈ ఏడాది ఇరవై నుంచి ఇరవై ఐదు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులు వాపోతున్నారు.ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. టోకెన్లు ఇంత వరకూ జారీ కాకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. తేమ ఎక్కువగా ఉందని అధికారులు కొనుగోలుకు తిరస్కరిస్తున్నారు. గోనె సంచిలు కూడా తమకు అందడం లేదని రైతులు చెబుతున్నారు. 48 గంటల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని హామీ ఇచ్చినప్పటికి ఇప్పటి వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవలేదు. దీంతో కొందరు రైతులు రోడ్లపైనే ధాన్యం ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిల్లర్లు సిండికేట్ అయి రైతులను దోచుకుంటున్నారని అన్నదాతలు ఆవేశంగా చెబుతున్నారు. గ్రౌండ్ లెవెల్ లో ఈ వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తేమ 16 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు షరతులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.



కృష్ణా జిల్లాలోనే ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గత ఏడాది 2,500 నుంచి 2,700 క్వింటాల్ కు పలికిన ధర ఈ ఏడాది పదిహేను వందల నుంచి పదిహేడు వందల రూపాయలకు పడిపోయిందని రైతులు చెబుతున్నారు. గిట్టుబాటు ధరలు రాకపోవడంతో రైతులు గోదాముల్లో ధాన్యాన్ని దాచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మోంథా, దిత్వా తుపాను దెబ్బకు తీవ్రంగా నష్టపోయిన రైతులు, ఎకరాకు పదివేల రూపాయల వరకూ నష్ట పోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. అప్పులు ఇచ్చిన వాళ్లు తమ మీద పడి వడ్డీతో పాటు కట్టాలని హుకుం జారీ చేస్తున్నారన్నారు. నాదెండ్ల మనోహర్ ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతులను దళారులను దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# నో హెల్మెట్, నో పెట్రోల్

తిరుపతి, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

తిరుపతిలో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు డిసెంబర్ 15 నుండి పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ పోయరు. రోడ్డు ప్రమాద సంబంధిత మరణాలను తగ్గించడానికి జిల్లా పోలీసులు 'నో హెల్మెట్?నో పెట్రోల్' నియమాన్ని కఠినంగా అమలు చేయనున్నారు.జాతీయ రోడ్డు ప్రమాదాల డేటా ప్రకారం దాదాపు 45 శాతం ప్రమాద మరణాలు ద్విచక్ర వాహనదారుల వల్లే సంభవిస్తున్నాయని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. అతివేగం, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం ఈ మరణాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయన్నారు.వాహనదారుడు, పిలియన్ రైడర్ ఇద్దరూ హెల్మెట్లు సరిగ్గా ధరిస్తే ఇలాంటి మరణాలలో 40 శాతం నివారించవచ్చని ఎస్పీ అన్నారు. రోడ్డు ప్రమాద మరణాలు కుటుంబంపై మానసికంగానే కాకుండా ఆర్థిక భారాన్ని కూడా కలిగిస్తాయన్నారు. దీనికి సంబంధించి, తిరుపతి జిల్లా పోలీసులు జిల్లా అంతటా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. ఇవి డిసెంబర్ 15 వరకు కొనసాగుతాయి.ప్రజలు ఈ నియమాన్ని అర్థం చేసుకోవడానికి, పాటించడానికి మేం తగినంత సమయం ఇస్తున్నాం. రైడర్, పిలియన్ రైడర్ ఇద్దరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి. డిసెంబర్ 15 తర్వాత, హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.' అని ఎస్పీ అన్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న పెట్రోల్ పంపుల యజమానులకు ఈ అమలు ప్రణాళిక గురించి ఇప్పటికే సమాచారం అందించారు తిరుపతి పోలీసులు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్ పోయకూడదని, ఈ మేరకు పోలీసులకు సహకరించాలని




పోలీసులు విజ్ఞప్తి చేశారు.ఏపీలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. నవంబర్ 5వ తేదీ దాకా సగటున రోజుకు 50 ప్రమాదాలు జరగ్గా.. అందులో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. 53 మంది వరకు క్షతగాత్రులు అవుతున్నారు. వాహనాలు అతివేగంగా వెళ్లడం కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో అధిక ప్రమాదాలు ఉన్నాయి. క్లిష్టమైన జిల్లాలుగా కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ గుర్తించింది.మరోవైపు ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సుమారు 400 మంది ప్రాణాలు కోల్పోయారు. 200 మందిలోపు మరణాలు, జరిగిన జిల్లాల లిస్టులో విజయనగరం, పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉన్నాయి.

=====================

# ఇండిగోకు కేంద్రం షాక్...

ముంబై, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

ఇటీవల 2 వేలకు పైగా విమానాలు రద్దు కావడంతో తలెత్తిన సంక్షోభం దృష్ట్యా.. కేంద్రం ఇండిగో సంస్థకు భారీ షాక్ ఇచ్చింది. ఇండిగో సంస్థ 10 శాతం విమానాలను తగ్గించాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది. దీంతో రోజుకు 200 ఇండిగో విమానాలు నిలిచిపోనున్నాయి. అయినప్పటికీ.. అన్ని మార్గాల్లో తమ సర్వీసులను కొనసాగిస్తామని ఇండిగో ప్రకటించింది.దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో సంస్థకు సంబంధించి.. ఇటీవల నెలకొన్న సంక్షోభం ఇప్పుడిప్పుడే సద్దుమణిగిపోతోంది. పూర్తి స్థాయిలో కార్యకలాపాలను సాగించేందుకు.. అన్ని రకాలుగా కృషి చేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇక వేలాది విమానాలు రద్దు కావడం వల్ల.. వేల మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడటం, కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇటీవల 2000కు పైగా విమానాలు రద్దు కావడంతో తలెత్తిన తీవ్ర సంక్షోభం వేళ.. కేంద్ర పౌరవిమానయాన శాఖ.. ఇండిగో సంస్థపై కొరఢా ఝళిపించింది. ఇండిగో సంస్థ తమ మొత్తం కార్యకలాపాల్లో 10 శాతం తగ్గించుకోవాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది కొద్ది రోజులుగా ఇండిగో విమానాలు భారీ సంఖ్యలో



రద్దు కావడం, ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి ప్రధానంగా సిబ్బంది రోస్టర్ నిర్వహణలో లోపాలు.. కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలకు అనుగుణంగా.. ఇండిగో సంస్థ తమ షెడ్యూల్‌ను మార్చుకోకపోవడం కారణమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు.. స్వయంగా పార్లమెంటు వేదికగా ప్రకటన చేశారు. ఇండిగో సంస్థ కార్యకలాపాలను మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావడానికి.. విమానాల రద్దులను తగ్గించడానికి ఈ 10 శాతం సర్వీసుల కోత అవసరమని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ భావించింది. అయితే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మాత్రం.. మొదట్లో 5 శాతం సర్వీసుల కోత విధించాలని నిర్ణయించగా.. తాజాగా విమానయాన మంత్రిత్వ శాఖ మాత్రం దాన్ని 10 శాతానికి పెంచింది.ఇండిగో సంస్థ.. రోజుకు దాదాపు 2200 విమానాలను నడుపుతుంది. తాజా 10 శాతం తగ్గింపు వల్ల.. 200కు పైగా విమానాలు రద్దు కానున్నాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలను పాటించాలని ఆదేశిస్తూ.. ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్‌ను మంత్రిత్వ శాఖ కార్యాలయానికి పిలిపించారు.కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశించిన 10 శాతం సర్వీసుల కోతకు తాము కట్టుబడి ఉన్నామని.. ఇండిగో సంస్థ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేసింది. ఈ 10 శాతం విమానాలు నడవకపోయినా.. ఇండిగో సంస్థ తన అన్ని గమ్యస్థానాలను మునుపటిలాగే కవర్ చేస్తుందని తెలిపింది.కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇండిగో సంస్థకు పలు ఆదేశాలు జారీ చేసింది. విమాన టికెట్ ధరలపై పరిమితిని పాటించడం.. విమాన ప్రయాణికుల సౌకర్యం కోసం చర్యలు తీసుకోవడం.. డిసెంబర్ 6వ తేదీ వరకు ప్రభావితమైన విమానాలకు 100 శాతం రీఫండ్‌లు పూర్తి అయ్యాయని ఇండిగో ధృవీకరించింది. మిగిలిన రీఫండ్‌లు, లగేజీని అప్పగించే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కఠినమైన సూచనలు జారీ చేశారు.ఈ విషయంలో దర్యాప్తు ప్రారంభించి విమానయాన సంస్థ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో ప్రకటించారు. దర్యాప్తులో తేలిన విషయం ఆధారంగా ఇండిగో సంస్థపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మరోవైపు.. ఈ సంక్షోభం నుంచి బయటపడడానికి తమ కార్యకలాపాలు ఇప్పుడు గాడిన పడుతున్నాయని ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ అంతకుముందు ట్వీట్ చేసినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

# సిటీలో 1500 కి.మీ. మేర 'పీపుల్ ఫస్ట్ కారిడార్లు'

హైదరాబాద్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం 'విజన్-2047'తో దూసుకుపోతోంది. మెరుగైన రవాణా, పారిశ్రామిక అభివృద్ధి, వారసత్వ సంపద పరిరక్షణ, పౌర సౌకర్యాలు, పచ్చదనం పెంపు వంటి అంశాలపై దృష్టి సారించారు. మూసీ నదిని సుందరీకరించి 24 గంటల తాగునీటి సరఫరా లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. హైదరాబాద్‌ను ఆవిష్కరణలకు, పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దడమే దీని ముఖ్య ఉద్దేశ్యం.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047 పేరుతో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలపడానికి బృహత్తర ప్రణాళికను రూపొందించింది. దేశంలోనే కాదు, ప్రపంచంలోని పది అగ్రగామి ఆవిష్కరణలకు, పెట్టుబడులకు, అత్యుత్తమ జీవన ప్రమాణాలకు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్నది విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యం. కోర్ అర్బన్ రీజియన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రణాళికలను ప్రభుత్వం నిర్దేశించింది. ఈ విజన్ ప్రధానంగా మొబిలిటీ, పారిశ్రామిక అభివృద్ధి, వారసత్వ సంపద, పౌర సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ అనే ఐదు కీలక స్తంభాలపై ఆధారపడి ఉంది.నగర భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో సమీకృత రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సర్వీసులను అనుసంధానించడం ద్వారా ప్రజలకు మెరుగైన ప్రయాణ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం కామన్ మొబిలిటీ కార్డును అందుబాటులోకి తీసుకురానున్నారు. అంతేకాక, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ప్రత్యేక మార్గాల్లో బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్) ను ఏర్పాటు చేయనున్నారు. ప్రజారవాణాను ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించడం ద్వారా శివారు ప్రాంతాల ప్రజలకు సౌలభ్యం కల్పించనున్నారు. ముఖ్యంగా, రవాణా ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజారవాణా మార్గాల నుంచి కేవలం 15 నిమిషాల్లో చేరుకునే దూరంలో నిర్మించే కార్యాలయాలు, వాణిజ్య భవనాలు, నివాసాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది.నగరంలో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి 1,000 కి.మీ. వాకింగ్, సైక్లింగ్ కారిడార్లు, పాదచారుల కోసం అంతరాయాలు లేని పాదబాటలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, స్కైవాక్‌లను నిర్మించనున్నారు. నగరవ్యాప్తంగా 1500 కి.మీ. మేర 'పీపుల్ ఫస్ట్ కారిడార్ల'ను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ రద్దీ లేని, సురక్షితమైన వీధులను డిజైన్ చేయనున్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న పారిశ్రామిక భూములను బహుళ వినియోగానికి అనువుగా అభివృద్ధి చేయడానికి బ్లూన్‌ఫీల్డ్ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నారు. పర్యాటక రంగ అభివృద్ధి లక్ష్యంగా వారసత్వ సంపద సంరక్షణకు చర్యలు తీసుకుంటారు. పాతబస్తీకి యునెస్కో వరల్డ్ హెరిటేజ్ హోదా సాధించడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. 100 పార్కులను, ప్లాజాలను సాంస్కృతిక కేంద్రాలుగా తీర్చిదిద్ది, భారీ ఈవెంట్లకు వేదికలుగా మారుస్తారు. నైట్ ఎకానమీని పెంచడానికి సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్స్, జలాశయాల వద్ద, ఐటీ కారిడార్లలో 24 గంటలు పనిచేసేలా హ్యాకర్స్ సెంటర్స్ 2.0 మరియు ఆధునిక మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు.పర్యావరణ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని బ్లూ-గ్రీన్ హైదరాబాద్- 2047 పేరుతో ప్రత్యేక ప్రణాళికను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా మూసీ నదిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేపడతారు. పశ్చిమం నుంచి తూర్పు వరకు 35-40 కి.మీ. పొడవునా నడక మార్గాలు, వాటర్ ట్యాక్సీ డాక్స్, జెట్టీలు, వంతెనలు, వ్యూయింగ్ డెక్‌లతో సుందరీకరణ చేపట్టనున్నారు. 100 చెరువులను సుందరీకరించడంతో పాటు హుస్సేన్‌సాగర్ 2.0 ద్వారా దానిని మరింత అభివృద్ధి చేస్తారు. జలాశయాల వద్ద సైక్లింగ్, వాకింగ్ లూప్స్, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, రెయిన్ గార్డెన్స్ ఏర్పాటు చేస్తారు. 1500 కి.మీ. అర్బన్ ఫారెస్ట్ బ్లాక్స్, స్ట్రీట్ కనోపీ, నడక మార్గాలు ఏర్పాటు చేయడం ద్వారా నగరంలో పచ్చదనాన్ని పెంచుతారు. ఈ విజన్‌లో అత్యంత ముఖ్యమైన అంశం ఏంటంటే, ప్రజలకు 24 గంటలూ తాగునీరు సరఫరా చేసే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది.

# ఇటు నుంచి రెండు.. అటు నుంచి నాలుగు

హైదరాబాద్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

కల్వకుంట్ల కవిత రెండు అని నాలుగు అనిపించుకుంటున్నారు. తమ పార్టీ అధినేత కుమార్తె అని కూడా బీఆర్ఎస్ నేతలు చూడటం లేదు. తమపై విమర్శలు చేసిన వెంటనే రియాక్ట్ అవుతున్నారు. బీఆర్ఎస్ లో ఉండగా వంగి వంగి నమస్కారాలు చేసిన వారే నేడు తిట్లదండకాన్ని అందుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ కు గురయిన తర్వాత కల్వకుంట్ల కవిత ప్రజా సమస్యలపై స్పందిస్తే బాగుంటుందని, కానీ కేసీఆర్ నాయకత్వంలో పనిచేసిన ఎమ్మెల్యేలు,



మంత్రులపై తీవ్ర విమర్శలు చేస్తుంటే అది కేసీఆర్ పాలనపైనే పడినట్లు కాదా? అని గులాబీ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ జాగృతి పేరిట రాష్ట్రంలో పర్యటించవచ్చు. అదే సమయంలో ప్రస్తుతం ఉన్న ప్రజా సమస్యలను కూడా ఆమె ప్రస్తావించవచ్చు.కానీ బీఆర్ఎస్ నేతలపై ఆమె విమర్శలు చేయడం ఇప్పుడు పార్టీకి ఇబ్బందికరంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న సమయంలో కల్వకుంట్ల కవిత చేస్తున్న విమర్శలు బీఆర్ఎస్ కు రాజకీయంగా ఇబ్బందికరంగా మారుతున్నాయి. అందుకే ప్రతి దాడి చేస్తున్నారు. కవిత రెండు విమర్శలు చేస్తే బీఆర్ఎస్ నేతలు మాత్రం తగ్గకుండా పూర్తి స్థాయిలో కవితను కార్నర్ చేస్తుండటంతో గులాబీ పార్టీ అభిమానులు లోపల బాధపడుతున్నారు. అదే సమయంలో కవిత కూడా సంయమనం పాటించాలని కోరుతున్నారు. ఇటీవల మహబూబ్ నగర్ జిల్లాలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిపై విమర్శలు కల్వకుంట్ల కవిత చేయడంతో ఆయన లిక్కర్ రాణి అంటూ వ్యాఖ్యానించారు.తాజాగా కూకట్ పల్లిలో తిరుగుతూ బీఆర్ఎస్ బీటీం, యూటీం అంటూ మల్లారెడ్డితో పాటు పార్టీ ఎమ్మెల్యేలపై కల్వకుంట్ల కవిత విరుచుకుపడటంతో అందుకు దీటుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. . కవిత చరిత్ర ఏంటో తనకు తెలుసునని ఆయన అన్నారు. ఆమె ఏ బంగారం దుకాణాన్ని వదల్లేదని అన్నారు. కేసీఆర్ పై అభిమానంతో తాము కవితపై మాట్లాడటం లేదని మాధవరం కృష్ణారావు అన్నారు. నీ సంగతి, నీ మొగుడు సంగతి ఏంటో తనకు తెలుసునని అన్నారు.మంత్రి పదవులు ఎంతకు అమ్ముకున్నావో అందరికీ తెలుసునని మాధవరం కృష్ణారావు అన్నారు. నీ బండారం బయటపెడితే నువ్వు బయట కూడా తిరగలేవని మాధవరం కృష్ణారావు అన్నారు. హరీశ్ రావును పార్టీ నుంచి వెళ్లగొట్టి, కేటీఆర్ ను అరెస్ట్ చేయించి దోచుకు తినడానికే ప్లాన్ చేశామని ఆయన మండిపడ్డారు. నీ మొగుడి అక్రమాల చిట్టా తన వద్ద ఉందని మాధవరం కృష్ణారావు అన్నారు. ఇలా కల్వకుంట్ల కవిత రెండు అని నాలుగు తగిలించుకుని తిరుగుతున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# కేటీఆర్ పాస్, ఫెయిలా...

హైదరాబాద్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయింది. సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనపై అందరూ విశ్లేషిస్తారు. కానీ ప్రతిపక్ష పనితీరును కూడా విశ్లేషించాలి. తెలంగాణలో బలమైన ప్రతిపక్షం ఉంది. బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసే అంత బలం సాధించుకుంది. మరి రెండేళ్లలో తన బలాన్ని ఉపయోగించి కాంగ్రెస్ ను ఇరుకున పెట్టగలిగిందా.. ప్రజాదరణను పెంచుకునే ప్రయత్నం చేసిందా అంటే దిక్కులు చూడాల్సిందే. కేసీఆర్ పూర్తిగా రెండేళ్లుగా ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన బాధ్యతను కేటీఆర్ తీసుకున్నారు. కానీ రేవంత్ కు సీఎం పదవి ఎలా కొత్తగా అనిపిస్తుందో..కేటీఆర్‌కు విపక్ష పదవి అలాగే అనిపిస్తోంది. ఆయన ఆన్ లైన్ నాయకుడు అయ్యారు. ఆఫ్ లైన్ లో మాత్రం ఇంకా తాను సమర్థుడినని నిరూపించుకోలేకపోయారు.రేవంత్ రెడ్డిని తన సమకాలికుడిగా చూసేందుకు కేసీఆర్ రెడీగా లేరు. అదే సమయంలో ఆయనకు ఆరోగ్యం కూడా సహకరించడం లేదని చెబుతున్నారు. అందుకే ఫామ్ హౌస్ కు పరిమితమయ్యారు. అయితే పార్టీలో సమస్యలు రాకుండా ప్రతిపక్ష నేతగా తానే వ్యవహరిస్తున్నారు. కానీ బాధ్యతలు మాత్రం కేటీఆర్ తీసుకున్నారు. పార్టీని నడుపుతూ.. ప్రభుత్వంపై పోరాటాన్ని చేయాల్సిన బాధ్యత తీసుకున్నారు. రెండేళ్లుగా ఆయన పోరాడుతూనే ఉన్నారు.కానీ కేసీఆర్ లాంటి నేత రోల్ తీసుకున్నప్పుడు మెప్పించాలంటే చాలా కష్టం. అదే జరుగుతోంది. ఆయన కేసీఆర్ ను మరిపించలేరు.. ప్రజలకు ప్రత్యామ్నాయ నేత అనే నమ్మకం కూడా కలిగించలేకపోతున్నారు. దానికి సాక్ష్యం.. రెండు అసెంబ్లీ స్థానాలను కోల్పోవడం.. లోక్ సభలో ప్రాతినిధ్యం సాధించలేకపోవడం.బీఆర్ఎస్ ఓడిపోయాక..కేటీఆర్ ఓ స్థిరనిర్ణయానికి వచ్చారు. తమకు యూట్యూబ్ చానళ్లు లేకే ఓడిపోయామని అన్నారు. ఆయన తప్పుగా ..లోపంగా భావించిన దాన్ని సరి చేసుకున్నారు. భారీ ఖర్చుతో యూట్యూబ్,సోషల్ మీడియా చానళ్లు రన్ చేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో వీరందరూ కలిసి ఇక ఏముంది బీఆర్ఎస్ గెలుచుడే అని ప్రచారం చేశారు. చివరికి ఏమయింది.. పాతిక వేల ఓట్ల తేడాతో బీఆర్ఎస్ ఓడిపోయింది.అది రియాలిటీ. సోషల్ మీడియాతోనే రాజకీయాలు చేస్తే.. తనను తాను మోసం చేసుకున్నట్లు అయింది. గ్రౌండ్ లో పరిస్థితిని అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారు. మొత్తం రెండేళ్ల రాజకీయం అలాగే నడిచింది. తాము ఇంకా ప్రతిపక్ష పాత్రను పోషించతడం లేదని ఓ సందర్భంలో జగదీష్ రెడ్డి కూడా నేరుగానే చెప్పారు.రేవంత్ ?కేసీఆర్ ను ఓడించారు. ఆ విషయం గుర్తు పెట్టుకునే ఆయనకు కౌంటర్ రాజకీయాలు చేయాలి. అంతే కానీ తక్కువ అంచనా వేసి.. ఇష్టం వచ్చినట్లుగా బూతులు తిట్టి..తిట్టించేసి రాజకీయాలు చేస్తే మిస్ ఫైర్ అవుతాయి. సీఎంవోలో కోవర్టుల్ని పెట్టుకుని సమాచారం తెప్పించుకుంటే బండి నడిచిపోదు. రేవంత్



కింది ఎదిగిన రాజకీయ నేత. ఆయన జాక్ పాట్ కొట్టి రాలేదు. ప్రతి దశలోనూ కిందకు కొడితే..పైకి ఎదిగి వచ్చారు. కేటీఆర్ కు ఎప్పుడూ అలాంటి స్ట్రగుల్ రాలేదు. వస్తేనే నాయకత్వ లక్షణాలు బయటపడతాయి. అలాంటి అవకాశం ఇవ్వాలని కూడా రేవంత్ అనుకోవడంలేదు. అదే ఆయన తెలివి. కేటీఆర్ ఈ విషయాలను అర్థం చేసుకోలేకపోతున్నారు. ఈ రెండేళ్లలో ఆయన తన వ్యూహాల ప్రకారం రాజకీయాలు చేశానని అనుకుంటూ ఉండవచ్చు కానీ ఆయన చేసింది రేవంత్ రెడ్డి తరఫున రాజకీయమేనని అనుకోవచ్చు.

# అన్నీ సేవలన్నీ గ్రేటర్ నుంచే

హైదరాబాద్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

ఇటీవల జీహెచ్ఎంసీలో విలీనం అయిన 27 మున్సిపాలిటీలు అందించే అన్ని సేవలను శనివారం నుండి




కార్పొరేషన్ చూసుకుంటుంది. ఇందులో భవన నిర్మాణ అనుమతులు, జనన మరియు మరణ ధృవీకరణ పత్రాలు, వాణిజ్య లైసెన్స్‌తోపాటుగా మరిన్ని ఉన్నాయి. ధృవపత్రాలు, అనుమతులు, రసీదులలో జీహెచ్ఎంసీ లోగో ఉంటుంది.27 మున్సిపాలిటీలు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలను కలుపుతూ ఔటర్ రింగ్ రోడ్ లోపల లేదా ఆనుకుని ఉన్నాయి. మున్సిపాలిటీలు కేటాయించిన జీహెచ్ఎంసీ సర్కిల్, జోన్ ద్వారా భవన నిర్మాణ అనుమతులు ప్రాసెస్ అవుతున్నాయి. దరఖాస్తులను బిల్డ్ నౌ ద్వారా ప్రాసెస్ చేస్తున్నారు.గతంలో మున్సిపాలిటీలలో మూడు అంతస్తులు లేదా అంతకంటే తక్కువ నిర్మాణాలకు భవన అనుమతిని సంబంధిత మునిసిపాలిటీ లేదా మున్సిపల్ కార్పొరేషన్ మంజూరు చేసేది. మూడు అంతస్తులకు పైగా నిర్మాణాలకు హెచ్ఎండీఏ అనుమతి ఇచ్చేది.శనివారం నుండి అన్ని భవన నిర్మాణ అనుమతులను జీహెచ్ఎంసీ మంజూరు చేయడం ప్రారంభించింది. ఎత్తైన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ సర్కిల్ లేదా జోనల్ కార్యాలయాలు కాకుండా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం అనుమతి ఇస్తుందిఈ 27 మున్సిపాలిటీలలోని ఇతర సేవలను కూడా జీహెచ్ఎంసీ చూసుకుంటుంది. ఉదాహరణకు పోచారం మునిసిపాలిటీలో దరఖాస్తు చేసుకున్న జనన ధృవీకరణ పత్రం జీహెచ్ఎంసీ పేరుతో వస్తుంది. 20 మునిసిపాలిటీల మున్సిపల్ కమిషనర్లను సంబంధిత డిప్యూటీ కమిషనర్లుగా నియమించారు. కొత్త డిప్యూటీ కమిషనర్లు కూడా వారి సంబంధిత జోనల్ కమిషనర్లకు నివేదిస్తారు.జీహెచ్ఎంసీలో విలీనం అయిన 27 మున్సిపాలిటీల్లో కమిషనర్ల ద్వారా 1000 చదరపు గజాల స్థలం వరకు రెసిడెన్షియల్ భవనానికి నాలుగు ఫ్లోర్లు, కమర్షియల్ బిల్డింగ్‌కు ఐదు ఫ్లోర్లు అనుమతులు జారీ అవుతున్నాయి. ఆపైన కావాలంటే హెచ్ఎండీఏ ద్వారా జారీ చేస్తున్నారు. జీహెచ్ఎంసీలో విలీనం కావడంతో వాటిని సర్కిళ్లుగా మార్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో అయితే సర్కిల్ స్థాయిలో నాలుగు ఫ్లోర్లు, జోనల్ స్థాయిలో ఐదు ఫ్లోర్లకు మాత్రమే అనుమతి ఇవ్వడానికి అధికారాలు ఉన్నాయి. ఆ పైన నిర్మాణ అనుమతులను ప్రధాన కార్యాలయం స్థాయిలో ఇస్తున్నారు. బిల్డ్‌నౌలో అవసరమైన మార్పులు చేశారు. దీంతో నిర్మాణ అనుమతుల దరఖాస్తుల ప్రక్రియ ప్రాసెస్ అందులో ఉంటుంది. అయితే వచ్చే కొన్ని సమస్యలు కూడా త్వరలో పరిష్కారం అవుతాయని అధికారులు చెబుతున్నారు.

# తెలంగాణలో ఇలా

హైదరాబాద్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. డిసెంబర్ 7 నుంచి డిసెంబర్ 16వ తేదీ దాకా చలి గాలులు వీస్తాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించారు. రాబోయే 7 రోజుల్లో చలిగాలులకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. డిసెంబర్ 10 నుంచి 13వ తేదీ మధ్య చలిగాలులు ఎక్కువగా ఉంటాయన్నారు. తాజాగా ఉదయంపూట అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి.సంగారెడ్డిలో 6.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అసిఫాబాద్ 6.6, ఆదిలాబాద్ 6.8, వికారాబాద్ 7.8, కామారెడ్డి 8.2, నిజామాబాద్ 8.4, మెదక్ 8.4, రంగారెడ్డి 8.4, సిద్దిపేట 8.9, నిర్మల్ 9.0, సిరిసిల్ల 9.2 ఉష్ణోగ్రతలు ఈ ఉదయం నమోదు అయ్యాయి.భాగ్యనగరంలోనూ చలి వణికిస్తోంది. శేరిలింగంపల్లి 8.4, రాజేంద్రనగర్ 10.1, అల్వాల్ 10.6, బీహెచ్ఈఎల్ 10.6, ఆర్సీ పురం 12.2, నేరెడ్‌మెట్ 12.4, చందానగర్ 12.4, కంచన్‌భాగ్ 13.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.జనాలు విపరీతమైన చలి కారణంగా ఎక్కువగా ఇళ్లలోనే ఉండిపోతున్నారు. మంటలకు దగ్గరగా ఉంటున్నారు. ఏఎస్ఆర్ జిల్లాలోని అనేక ప్రాంతాలను దట్టమైన పొగమంచు కప్పేసింది. ఉదయంపూట ఎటు వెళ్లలేని పరిస్థితి. పొగమంచుతో దారులు సరిగా కనిపించడం లేదు. ఆదివారం జి మాడుగులలో 5.3 డిగ్రీల సెల్సియస్, ముంచింగిపుట్టులో 7.7 డిగ్రీలు, అరకు వ్యాలీలో 8.9, లంబసింగిలో 9.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చింతపల్లె వద్ద 9.5 డిగ్రీలుగా నమోదైంది. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం గడ్డకట్టే పరిస్థితులు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. విశాఖ నగరంలో అత్యల్ప ఉష్ణోగ్రత 17.4 డిగ్రీలకు పడిపోవడంతో ప్రజలు చలిగా భావించారు. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నంలో ఆదివారం 15.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా తీరప్రాంతం,



రాయలసీమ ప్రాంతాలలో ఆదివారం కనిష్ట ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయాయి. రాబోయే రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తగ్గనున్నట్టుగా వాతావరణ శాఖ అంచనా వేసింది.దిత్వా తుపాను, వర్షపాతం కారణంగా నవంబర్‌లో పర్యాటకుల రాక తగ్గిందని ఏఎస్ఆర్ జిల్లాలోని స్థానికులు తెలిపారు. మళ్లీ పర్యాటక రాక పెరుగుతుందని భావిస్తున్నారు.అంతకుముందు నవంబర్ 19వ తేదీన చింతపల్లెలో ఈ సీజన్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత 6.8 డిగ్రీలుగా నమోదైంది. జనవరి 8, 2023లో చింతపల్లెలో 1.5 డిగ్రీల సెల్సియస్‌ని తాకింది. ఉదయం వేళల్లో ప్రయాణికులు ఎటైనా వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగమంచు కప్పేస్తుంది. రహదారులు కనిపించడం లేదు. రాబోయే రోజుల్లో మరింత ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది.

# టీడీపీ వర్సెస్ రిపబ్లిక్..

ముంబై, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

దేశీయ ప్రైవేటు విమానయాన సంస్థ ఇండిగో వారం రోజులుగా విమానాలు నడపడం లేదు. షెడ్యూల్‌లో గందరగోళం కారణంగా.. విమానాలు నిలిచిపోయాయి. ఎయిర్ పోర్టుల్లో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. టికెట్ చార్జీల చెల్లింపు విషయంలోనూ జాప్యం చేస్తోంది. ఈ క్రమంలో ఇండిగో విమానాల సమస్యలు దేశవ్యాప్తంగా గందరగోళానికి దారితీసినప్పుడు టీడీపీ నాయకుడు దీపక్ రెడ్డి రిపబ్లిక్ టీవీ డిబేట్‌లో మంత్రి నారా లోకేష్ పేరు తెచ్చి విషయాన్ని సంక్లిష్టం చేశారు. ఏపీ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేని అంశంలో డిఫెన్సివ్ వాదనలు చేయడం పార్టీకి నష్టం కలిగించింది. అర్నబ్ గోస్వామి ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా విషయాన్ని మలుపు తిప్పడం సమస్యను మరింత పెంచింది.టీడీపీ నేతలు అర్నబ్ జర్నలిజం, ఛానల్ నాణ్యతపై విమర్శలు మొదలుపెట్టి సోషల్ మీడియాలో బాయ్‌కాట్ పిలుపు ఇచ్చారు. గతంలో కష్టకాలంలో రిపబ్లిక్ టీవీ టీడీపీకి మద్దతుగా నిలిచి, చంద్రబాబు అరెస్టు సమయంలో లోకేష్‌కు జాతీయ మీడియాలో వేదిక కల్పించింది అర్నబ్ గోస్వామినే. తాజాగా రిపబ్లిక్ టీవీపై చర్చ పెట్టడం అర్నబ్‌కు కోపం తెప్పించింది.బాయ్‌కాట్ ప్రకటనకు అర్నబ్ కోపం వచ్చింది. దీంతో చంద్రబాబు, లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును నిలదీశారు. ఇండిగో సమస్యకు కేంద్ర విమానయాన శాఖ వైఫల్యమే కారణమని టీడీపీ భావిస్తున్నప్పటికీ, అర్నబ్ టాపిక్ మలుపు తిప్పి బీజేపీని కాపాడుతున్నారని విమర్శలు వచ్చాయి. లోకేష్ అమెరికాలో ఉండటం వల్ల స్పందన లేకపోవడం వివాదాన్ని మరింత పెంచింది.ఈ సంఘటన టీడీపీ నేతలు అనవసర విషయాల్లో తలదూర్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తోంది. రిపబ్లిక్ టీవీ వంటి మీడియాతో సంబంధాలు గతంలో ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, స్వయం గోల్‌లు పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీస్తాయి. ప్రజలకు సమస్యలు తెలిసినప్పటికీ మీడియా పోరులు రాజకీయ లాభం ఇవ్వవు.

# లోకల్ లైట్...

హైదరాబాద్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

పార్టీ పవర్‌లో లేదు. పైగా సిచ్యువేషన్స్ బాలేవు. పోనీ పట్టుబట్టి అభ్యర్థులను గెలిచిపించినా..ఎన్నికయ్యాక వాళ్లు పార్టీలో ఉంటారో జంప్ అవుతారో తెలియదు. ఎందుకొచ్చిన టెన్షన్.



లైట్ తీసుకుంటే పోలా అంటోందట బీఆర్ఎస్. అందుకే సర్పంచ్ ఎన్నికలపై గులాబీ పార్టీ సీరియస్‌గా ఫోకస్ పెట్టడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఓవైపు సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుని జిల్లాల టూర్ చేస్తుంటే..బీఆర్ఎస్ మాత్రం కనీసం పట్టించుకోవడం కాదు కదా..ఓ సమీక్ష కూడా చేయకపోవడం చర్చకు దారితీస్తోంది.తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రాజకీయం అంతకంతకు హీటెక్కుతోంది. నువ్వానేనా అన్నట్లుగా పోటీ పడుతున్నారు ప్రధాన పార్టీల అభ్యర్థులు. చాలా చోట్ల కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అయితే పంచాయతీ ఎన్నికల వేళ..జిల్లా టూర్‌లో బీఆర్ఎస్‌పై విమర్శల దాడి చేస్తున్నారు.

ప్రజాపాలన రెండేళ్ల సంబరాల పేరుతో జిల్లాల్లో పర్యటిస్తున్న రేవంత్..సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వరాల జల్లులు కురిపిస్తున్నారు. వెళ్లిన చోటల్లా పెద్దఎత్తున నిధులను మంజూరు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు ముఖ్యమంత్రి. సాధ్యమైనంత వరకు మెజారిటీ పంచాయతీలను గెలుచుకోవాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ఇండైరెక్ట్‌గా పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని చెబుతున్నారు. దీన్ని బట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలను ఎంత సీరియస్‌గా తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు.ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ మాత్రం పంచాయతీ ఎన్నికలను లైట్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటమి తర్వాత ఇంకాస్త నిరాశ చెందిన గులాబీ పార్టీ ఇంకా దాని నుంచి బయటకు రాలేకపోతోందన్న చర్చ జరుగుతోంది. ఇక స్థానిక సంస్థల ఎన్నికలు అంటే ఎలాగూ అధికార పార్టీదే పైచేయి ఉంటుంది. పైగా పట్టుబట్టి అభ్యర్థులను పెట్టి గెలిపించినా వారు పార్టీలో ఉంటారో లేదోనన్న డైలమా ఉందట. అన్నింటికి మించి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు ఫండింగ్ చేయడం కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ ఇంచార్జ్‌లకు ఇప్పుడున్న పరిస్థితుల్లో భారంగా మారనుంది.ఈ అంశాన్నింటిని దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ ఎన్నికలను లైట్ తీసుకుందట బీఆర్ఎస్. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ గుర్తు ఉంటుంది కాబటి..అప్పుడు ఎంతో కొంత ఫోకస్ చేయాలని భావిస్తోందట. మెయిన్‌గా అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా పని చేసుకుంటూ పోవాలనేది బీఆర్ఎస్ కారు పార్టీ ఆలోచనగా చెబుతున్నారు. 20 నుంచి 30 నియోజకవర్గాలు మినహా మిగతా నియోజకవర్గలో బీఆర్ఎస్ నేతలు పంచాయతీ ఎన్నికలను అంత సీరియస్‌గా తీసుకోవడం లేదని తెలంగాణ భవన్ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది.పార్టీ క్యాడర్ స్ట్రాంగ్‌గా ఉన్నచోట..ఎమ్మెల్యేలు అండదండలు ఉన్న దగ్గర..కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అంటున్నారట బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు. రాష్ట్ర పార్టీ మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలను పెద్దగా పట్టించుకోవడం లేదని..అంతర్గతంగా మాజీ మంత్రులు ఓసారి జిల్లాల వారీగా సమీక్ష చేశారని అంటున్నారు.పంచాయతీ ఎన్నికలను కారు పార్టీ లైట్ తీసుకోవడానికి ఎన్నో రీజన్స్ ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. ఇప్పుడు సర్పంచ్‌లను, వార్డు సభ్యులను గెలిపించుకున్నా ఆ తర్వాత వాళ్లను అధికార కాంగ్రెస్.. పార్టీలో చేర్చుకుంటుందని బీఆర్ఎస్ భావిస్తోందట. ఇప్పటికే చాలాచోట్ల బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాలనుకున్న సర్పంచ్ అభ్యర్థులు..కాంగ్రెస్ నేతల ప్రలోభాలకు వెళ్లిపోయారని గులాబీ పార్టీ నేతలు వాపోతున్నారు. దీంతో కారు పార్టీ నుంచి పోటీ చేసేందుకు కొన్నిచోట్ల అభ్యర్థులు కూడా లేరన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ తాము బలపరిచిన అభ్యర్థులు గెలిచినా..అభివృద్ధి పేరుతో హస్తం గూటికి చేరే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికలను పెద్దగా పట్టించుకోవడం లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే పరిస్థితులు ఎలా ఉన్నా స్థానిక ఎన్నికలపై పార్టీ చేతులు ఎత్తేస్తే రానున్న రోజుల్లో క్యాడర్ చేజారిపోయే ప్రమాదం ఉందని బీఆర్ఎస్‌లో అంతర్గత చర్చ జరుగుతోంది

# కలహాల కాపురం కాంగ్రెస్‌ను ఏం చేస్తుందో

హైదరాబాద్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

కాంగ్రెస్‌లో కలహాలు కామన్. ఓ నేత అంటే మరో లీడర్‌కు పడదు. ఇంకో నాయకుడి ఎదుగుదలను మరొక నేత డైజెస్ట్ చేసుకోలేరు. ఇక పవర్‌లోకి వచ్చాక ఈ గొడవ ఇంకా ఎక్కువైంది. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల వేళ.. ఇంటి పోరు హస్తం పార్టీకి హెడెక్‌గా మారిందట. మరీ ముఖ్యంగా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న నల్గొండ జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల ఆధిపత్య పోరు..సర్పంచ్ ఎన్నికల్లో పోటీనే మార్చేసిందట. ఏ ఊరికి వెళ్లినా కనీసం ఇద్దరు నేతలు కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ ఉండటంతో.. ఎక్కడ తమ పుట్టి మునుగుతుందేమోనని టెన్షన్ పడుతున్నారట హస్తం పార్టీ పెద్దలు.అధికార హస్తం పార్టీకి నల్గొండ జిల్లా కంచుకోట. 12 అసెంబ్లీ సీట్లు ఉంటే ఒక్క సూర్యాపేటలో మినహా మిగతా 11 సీట్లను తన ఖాతాలో వేసుకుంది కాంగ్రెస్ పార్టీ. జిల్లాలో కీలక పదవులన్నీ కాంగ్రెస్ నేతల చేతుల్లోనే ఉన్నాయి. చాలా ముఖ్యమైన పంచాయతీ ఎన్నికల్లోనే హస్తం పార్టీకి అసలు సమస్య వచ్చి పడిందట. ఇన్నాళ్లుగా లీడర్ల మధ్య నడిచిన కోల్డ్ వార్ కాస్త.. వర్గపోరుగా మారి..రచ్చకెక్కి ఇంటిపోరును రోడ్డున పడేస్తుందట. ఇప్పటికే పాత, కొత్తగా విడిపోయిన అధికార పార్టీ నేతలు పార్టీలో కుంపటి పెట్టారట. జరుగుతున్న పరిణామాలు తెలుస్తున్నా..నోరెత్తలేని పరిస్థితుల్లో ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారని ఆ పార్టీ సీనియర్ లీడర్లే చెబుతున్నారు. ముఖ్యంగా జనరల్ స్థానాల్లో ఇటువంటి ఇంటి పోరు ఎక్కువగా ఉందని అంటున్నారు హస్తం నేతలు.ఆధిపత్య పోరుతో పల్లె పోరు అధికార హస్తం పార్టీకి చెమటలు పట్టిస్తోందట. ఉమ్మడి జిల్లాలో దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే దాదాపు అన్నిచోట్ల పోటీ కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టుగానే ఉంటోందట. హస్తం పార్టీ లీడర్లే వర్గాలుగా విడిపోయి పోటీ పడుతున్నారట. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఒరిజినల్ కాంగ్రెస్..వలస కాంగ్రెస్ లీడర్ల మధ్య గట్టి ఫైట్ నడుస్తోందట. సీనియర్ కాంగ్రెస్ నేతల అనుచరులు కూడా రంగంలోకి దిగడంతో బుజ్జగింపులు కత్తి మీద సాములాగా మారాయంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు బుజ్జగించినా పెద్దగా ఫలితం ఇవ్వకపోవడంతో తలలు పట్టుకున్నారట.తమ నేతల మధ్య పోటీ ఎక్కడ విపక్షాలకు మేలు చేస్తుందోనన్న టెన్షన్ అధికార పార్టీ నేతల్లో కనిపిస్తోందట. పైకి మాత్రం ఎవరు గెలిచినా తమ పార్టీ వారే కదా అంటున్నప్పటికీ..ఇంటిపోరు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందట. నకిరేకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేముల వీరేశం తాను బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గానికి చెందిన వారు కూడా నామినేషన్లు వేశారట.మొదటి దశ పోలింగ్ జరిగే మెజార్టీ పంచాయతీల్లో దాదాపుగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వర్గీయులే బరిలో ఉన్నారట. రాజకీయంగా ప్రభావం చూపే సర్పంచ్ ఎన్నికల్లో మంత్రి అనుచరులు బరిలో నిలవడంతో నకిరేకల్ హస్తం రాజకీయం వేడెక్కుతోంది. మార్కెట్ కమిటీల నియామకం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం మధ్య గ్యాప్ పెరిగిందనే ప్రచారం బలంగా ఉంది. అటు మంత్రి, ఇటు ఎమ్మెల్యే కావడంతో సీనియర్ నేతలు కూడా తమకు ఎందుకొచ్చిన లొల్లి అని మౌనంగా ఉంటున్నారట.మంత్రి అండ చూసుకొని కొందరు గ్రామ, మండల స్థాయి నేతలు వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే వేముల వీరేశం అసహనంగా ఉన్నారట. మంత్రి కూడా నో డిస్కషన్స్..మన మనుషులు బరిలో ఉండాల్సిందేనని పట్టుబట్టడంతో పలు చోట్ల పోటీ తప్పలేదని అంటున్నారు. అటు మంత్రి, ఇటు ఎమ్మెల్యే వ్యూహాలకు పదును పెడుతుండటంతో నకిరేకల్ కాంగ్రెస్ రాజకీయం వేడుక్కుతోంది. ఇక తుంగతుర్తి నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గీయులు, దివంగత నేత దామోదర్ రెడ్డి వర్గీయులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. నియోజకవర్గంలో బరిలో ఉన్నవారిలో ఎక్కువ మంది తమ పార్టీ వాళ్లేనని హస్తం పార్టీ నేతలే చెప్పున్నారు.కొత్త కాంగ్రెస్, పాత కాంగ్రెస్‌గా విడిపోయిన క్యాడర్..ఎవరికి వారు నామినేషన్లు వేశారు. నియోజకవర్గంలోని 90శాతం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సపోర్టర్సే బరిలో ఉన్నారుట. పలుచోట్ల ముగ్గురు కాంగ్రెస్ మద్ధతుదారులు పోటీలో ఉండటంతో క్యాడర్ తలలు పట్టుకుంటున్నారట. ఓవైపు ఎమ్మెల్యే వర్గం, మరోవైపు దామోదర్ రెడ్డి వర్గంగా విడిపోయి ఎవరికి వారు పోటీ చేస్తుండడంతో ఎవరికి ఎవరు నచ్చచెప్పాలో కూడా తెలియని పరిస్థితి నెలకొందట.సూర్యాపేట నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి వర్గంగా విడిపోయి బరిలో నిలిచారు. ఇక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చెందిన హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల్లోనూ పలుచోట్ల సొంత పార్టీ నేతలే పోటీ పడుతుండటం ఆశ్చర్యంగా మారింది. మొదటి నుంచి పార్టీని నమ్ముకొని పనిచేస్తే..రాకరాక ఈ సారి అవకాశం వచ్చిందని..సమీకరణాల పేరుతో కొత్తవారికి టికెట్ ఇస్తున్నారంటూ పాత క్యాడర్ తీవ్ర ఆందోళనకు గురవుతోందట.మిర్యాలగూడలో కూడా పలు గ్రామాల్లో అధికార పార్టీ నేతల మధ్యే హోరాహోరీ పోరు కొనసాగుతోంది. పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికలు కాకపోవడం..ఎవరు గెలిచినా తమ పార్టీనే కదా అన్న ధీమాతో ఎమ్మెల్యేలు పలుచోట్ల పల్లె పాలిటిక్స్ జోలికి పోవడం లేదు. ఎవరు గెలిచినా పార్టీకి నష్టం లేదని ఎమ్మెల్యేలే అంటున్నారట. అయితే ముఖ్యనేతలను నమ్ముకొని పోటీ చేసి ఆర్థికంగా నష్టపోతే తమ పరిస్థితి ఏంటని అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారట.మరోవైపు అధికార పార్టీ అన్న తర్వాత ఆశావహులు ఎక్కువగా ఉంటారని కవర్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారట కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. ఇదే అదనుగా వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో తమ మద్ధతుదారులను గెలిపించుకోవాలని బీఆర్ఎస్ ఉవ్విళ్లూరుతోంది. పలుచోట్ల వామపక్ష పార్టీలతో అవగాహన కుదుర్చుకుంటూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు గులాబీ లీడర్లు.

## ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం



సికింద్రాబాద్.. డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

రాణిగంజ్ డిపోలో 65 ఎలక్ట్రికల్ ఆర్టీసీ బస్సులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ నగర మేయర్ విజయలక్ష్మి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. రాణిగంజ్ నుండి తార్నాక వరకు బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రజా పాలన ప్రభుత్వం ప్రారంభమై రెండు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో మహిళలకు ఆర్టీసీ లో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్ కరీంనగర్ నిజామాబాద్ తదితర ప్రాంతాలకు ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తున్నట్లు తెలిపారు. 251 కోట్ల మంది మహిళలు 8500 కోట్ల సార్లు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించినట్లు తెలిపారు. ఢిల్లీలో నెలకొన్న వాయు కాలుష్య పరిస్థితి తెలంగాణలో రాకుండా ఈవి పాలసీతో పాటు స్క్రాప్ పాలసీని తీసుకొచ్చినట్టు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమాన్ని భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. నూతన బస్సుల కొనుగోలు ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఐటీ కారిడారులతోపాటు గ్రామీణ ప్రాంతాలకు బస్సుల కనెక్టివిటీని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఎనిమిది వందల ఎలక్ట్రికల్ బస్సులో నడుస్తున్నాయని రాబోయే రెండేళ్లలో 2000 పైగా బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే కృష్ణారావు ఫ్రస్ట్రేషన్ లో వున్నారు
## అయన ఆరోపణలకు ఆధారాలతో వివరణ ఇస్తా: కవిత

హైదరాబాద్ డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం ఆయన ఫ్రస్ట్రేషన్ ను బయట పెడుతొందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆయన చేసిన అన్ని ఆరోపణలకు ఆధారాలతో సహా వివరణ ఇస్తా. ఆ మాటలకు ఫీలయ్యేది లేదు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు. రాష్ట్రంలో పాలక పక్షం, ప్రతిపక్షం పనిచేస్తలేవు. జనం గళంగా జాగృతి పనిచేస్తుందని అన్నారు. కూకట్ పల్లి 15 ఏళ్లుగా ఉన్న సమస్యలనే నేను చెప్పాను. ఇవ్వాళ మనం కంటోన్మెంట్ లోని బోయినపల్లి గవర్నమెంట్ స్కూల్ లో ఉన్నాం. మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ స్కూల్ ను బాగు చేశారు. కానీ కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు లేవు. వాటిని మేము ఏర్పాటు చేస్తాం. ఈ స్కూల్లోనే అంగన్ వాడీని కూడా కలిపారు. అంగన్ వాడీలో హెల్పర్లు లేరు. జనం బాటలో భాగంగా విద్య, వైద్యం మీద ఫోకస్ పెట్టామని అన్నారు.



స్కూల్స్, హాస్పిటల్స్ లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నాం. ఇండ్లు, ఇళ్ల పట్టాలను లేని వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నాం. మా వరకు చేయగలిగేది మేము ఒక సంస్థ గా చేస్తాం. టాప్ టెన్ విద్యార్థులకు మా తరఫున స్కాలర్ షిప్ లు ఇస్తాం. అదే విధంగా ప్రభుత్వం సాధించే వాటిని కూడా మేము చేయిస్తాం. ఏ జిల్లా కు వెళ్లిన ప్రజల నుంచి ఆదరణ, సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటోందని అన్నారు.

ప్రజల సమస్యలను వీలైనంతగా మేము పరిష్కరిస్తాం. గత ప్రభుత్వం లో నన్ను నిజామాబాద్ కే పరిమితం చేశాను. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏం జరుగుతుందో చూడలేదు. తెలంగాణ వచ్చాక ఏం జరిగింది. ఏం జరగలేదన్నది జనం బాట కార్యక్రమం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నా. మేము చేయగలిగేవి చేస్తాం. మిగిలిన సమస్యలపై ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తా. మంచిని మంచి, చెడును చెడు అనే అంటాం. ఈ స్కూల్ ను బాగు చేశారు. బాగుందనే అంటాం. రాష్ట్రంలో ప్రతిపక్షం పట్టించుకోవటం లేదు. పాలక పక్షం అసలే పట్టించుకుంట లేదు. అందుకే జాగృతి జనం గళమై పనిచేస్తోందని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీని నమ్మినోళ్ల గొంతు కోస్తున్న మంథని ఎమ్మెల్యే

**– ముఖం చెల్లకనే బీఆర్ఎస్ పార్టీ వాళ్లను ఏకగ్రీవం చేశారు**
**– కాంగ్రెస్‌లో ఉండే నాయకులు ఇప్పటికైనా ఆలోచన చేయాలి**
**– మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



మంథని డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

ఇరువై ముప్పై ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న నాయకుల గొంతు కోసిన చరిత్ర మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబుదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బుధవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో పుట్ట మధూకర్ మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌కు ప్రజల్లో నమ్మకం విశ్వాసం కోల్పోయినట్లు కన్పిస్తోందని, ఇదే విషయాన్ని తాము పదేపదే చెప్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. దుద్దిళ్ల శ్రీధర్ పెద్ద మోసగాడు ఐస్ గడ్డతో చంపేస్తడని చెప్పితే పెడచెవిన పెట్టే ఈ సమాజం, కాంగ్రెస్ పార్టీలో ఉన్నటువంటి నాయకులు కార్యకర్తలు అర్థం చేసుకుంటలేరని ఆయన అన్నారు. ఇందుకు ఈసారి జరిగే సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికే నిలువెత్తు నిదర్శన్నామన్నారు. మూడోసారి మంత్రిగా 40ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్న కుటుంబం వాళ్లు పెట్టిన క్యాండేట్లు గెలుస్తలేరని నిర్ణయం అయి నమ్మినోళ్ల గోంతులు కోశాడని ఆయన అన్నారు. మంత్రి అయిన తర్వాత మొదటిసారి మంథనిలో నిర్వహించిన ర్యాలీలో గొప్ప గొప్ప శ్లోకాలు చదివాడని, ఈసారి జరిగే సర్పంచ్ ఎన్నికల్లో తాము చెప్పిన వారు మాత్రమే ఊరికి ఒక్కరే కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఉంటారని, గతంలో ఊరికి ఇద్దరు ముగ్గురు నిలబడితే బీఆర్ఎస్ వాళు గెలిచారని, అలాంటి పరిస్థితి ఇప్పుడు ఉండదని నమ్మించి గ్రామపంచాయతీ ఎన్నికల్లో మాట తప్పాడని ఆయన ఎద్దేవా చేశారు. అయితే ఈసారి ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కోల్పోయామని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్ 30ఏండ్లుగా పార్టీ జెండా మోసిన నాయకులను పక్కకు పెట్టి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కండువా కప్పి ఏకగ్రీవం చేశాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను కాంప్రమైజ్ చేసి మా పార్టీ మెంబర్ షిప్ ఉన్నవాళ్లకు అవకాశం కల్పించడంలో మంథని ఎమ్మెల్యే నీతిని ఆ పార్టీ నాయకులు అర్థం చేసుకోవాలన్నారు. మైదుపల్లిలో పంతంగి లక్ష్మన్, చందనాపూర్‌లో కొండ శ్రీను, మహాదేవ్‌పూర్‌లో జువ్వాజి తిరుపతిలకు కండువా కప్పి కాంగ్రెస్ నాయకులను మోసం చేశాడన్నారు. చందనాపూర్‌లో బాబుమియా అనే నాయకులు అనేక ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ వేరే పార్టీ నాయకులతో కనీసం మాట్లాడడని, అలాంటి నాయకుడిని మోసం చేశాడని వాపోయారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మంథని ఎమ్మెల్యే ఎలా మోసం చేస్తాడో గమనించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కడ బానిసలుగా ఉంటరు కాబట్టే వాళ్లకు అర్థం కాదని విమర్శించారు. మంథని ఎమ్మెల్యే గొప్పవాడిగా తెలివితక్కువ ఉన్న మేధావులు కీర్తిస్తా ఉంటారని ఆయన అన్నారు. మంథని ఎమ్మెల్యేకు ప్రజల్లో ముఖం చెల్లి ఉంటే మా పార్టీ వాళ్లను తీసుకుని కండువా ఎందుకు కప్పాడో కాంగ్రెస్ నాయకులకే సమాధానం చెప్పాలన్నారు. మహదేవ్‌పూర్‌లో మొన్న రాత్రి గుడాల అరుణ అని ప్రకటించి మళ్లీ మరుసటి రోజున హసీనాబాను అని ప్రకటించారని, ఇలాంటి మోసాలపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉపవాసం ఉండి సద్దులు తెచ్చుకుని ఆ కుటుంబం కోసం పని చేసిన వాళ్ల గొంతు కోస్తున్నారని, దుద్దిళ్ల శ్రీధర్‌ను గొప్పగా అనే మూరు&ధలు ఇప్పటికైనా ఆలోచన చేయాలని హితవు పలికారు. అలాగే గాజులపల్లి, ఎగ్లాస్‌పూర్‌లాంటి అనేక గ్రామాల్లో ఇద్దరు ముగ్గురిని బరిలో నిలిపారని, పార్టీ రూల్స్ దాటితే చర్యలు అని ప్రకటన చేసిన మంత్రి ఇప్పటి వరకు ఎవరినైనా సస్పెండ్ చేశారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నాయకులు ఇప్పటికైనా అప్రమత్తం కావాలని, రాజకీయాల్లోకి ప్రత్యక్షంగా తీసుకువచ్చిన తమకు వాళ్ల నీతి వ్యవహారశైలి పూర్తిగా తెలుసునని, దగ్గరుండి చూశాం అనుభవించాం కనుకనే పదేపదే చెప్తున్నామని అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తగరం శంకర్ లాల్, ఆరేపల్లి కుమార్, కాయితి సమ్మయ్య,పుప్పాల తిరుపతి,మాచిడి సత్యనారాయణ గౌడ్, ఆసిఫ్ ఖాన్, ఇర్ఫాన్, పోలు కనకరాజు, మబ్బు నాగరాజు, జంజర్ల మురళి,సంతోష్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## హుజురాబాద్ లో ఘనంగా పండుగ సాయన్న వర్ధంతి వేడుకలు




హుజురాబాద్ డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బహుజన వీరుడు పండుగ సాయన్న వర్ధంతి వేడుకలను ప్రజాసంఘాలు ఘనంగా నిర్వహించారు. సాయన్న చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. 1860 నుండి 1900 కాలంలో బడుగు బలహీన వర్గాల హక్కులను కాలరాస్తున్న అప్పటి నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకించి పోరాడిన ధీశాలి పండుగ సాయన్న అని అన్నారు. సంపన్న వర్గాలను కొల్లగొట్టి పేద వర్గాలకు పంచిన తెలంగాణ రాబిన్ హుడ్ సాయన్న అని కొనియాడారు. అంతేకాకుండా ప్రత్యేక బీసీ సామ్రాజ్యం కోసం సామాజిక న్యాయం దిశగా పోరాటాలు చేస్తూ బీసీల సామ్రాజ నిర్మాణానికి కృషి చేశారని వారన్నారు. ఈ కార్యక్రమంలో బిసి ఆజాది ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్, ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్, హనుమాన్ దేవాలయ చైర్మన్ కొలిపాక శంకర్, ప్రజాసంఘాల నాయకులు సొల్లు బాబు, వేల్పుల రత్నం, తులసి లక్ష్మణమూర్తి, ఖలీద్ హుస్సేన్, ముక్క రమేష్, ఇప్పకాయల సాగర్, ఉప్పు శ్రీనివాస్, కేఆర్ బిక్షపతి, న్యాయవాది కామణి సమ్మయ్య, మమునూరు ప్రవీణ్, ఎర్రబోజు నారాయణ, అనగోని శ్రీనివాస్, బత్తుల మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

# జాధవ్ వందన మోహన్ అంతర్నీ గ్రామ సర్పంచ్ అభ్యర్థి

## గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 10 (భారత శక్తి):కుబీర్ మండలం అంతర్నీ గ్రామ పంచాయతీకి ఈసారి ఎస్టి మహిళా రిజర్వేషన్ కేటాయించడంతో జాదవ్ వందన మోహన్. సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నారు. రాజకీయ అనుభవంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని జాదవ్ వందన మోహన్. పేర్కొన్నారు. వ్యవసాయ రైతుల కోసం పొలంబాట రహదారి పనులను ప్రాధాన్యంగా తీసుకుంటానని, అనుబంధ గ్రామాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారులు, వంతెనలు నిర్మాణం చేసే దిశగా శ్రమిస్తానని హామీ ఇచ్చారు. వర్షాకాలంలో గర్భిణీలకు కలిగే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యవసర సేవలకు అనుకూలమైన మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఓటర్లు అవకాశమివ్వాలని, కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి:

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

మొదటి విడతలో గురువారం నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు-2025లో భాగంగా కరీంనగర్ జిల్లాలో మొదటి విడత పోలింగ్ జరగనున్న కరీంనగర్ రూరల్ మండలం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో, కొత్తపల్లి మండల డిస్ట్రిబ్యూషన్ ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని అన్నారు కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత డెంటల్ చికిత్స అందించాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

## కార్మికులకు ప్రత్యేక దంత వైద్య క్యాంపు



కరీంనగర్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లకు ప్రత్యేక దంత వైద్య క్యాంపుల ద్వారా దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ దంత వైద్యుల బృందాన్ని ఆదేశించారు.

కరీంనగర్ కళాభారతిలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్మికులకు ఏర్పాటుచేసిన ప్రత్యేక దంత వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికులు, మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రత్యేక క్యాంపుల ద్వారా ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దంత సమస్యలు ఉన్న వారిని వైద్యులు గుర్తించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తదుపరి చికిత్స ఉచితంగా అందజేస్తారని తెలిపారు. మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.దంత వైద్య బృందంతో మాట్లాడి క్యాంపుల నిర్వహణ, తదుపరి అందజేయాల్సిన వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్ఎంఓ నవీనా, ప్రభుత్వ దంత వైద్య అధికారులు రవి ప్రవీణ్ రెడ్డి, రణదీప్, ప్రవీణ్, రాజు, సతీష్ పాల్గొన్నారు.

# అద్భుత ప్రతిభ కలిగిన బాలుడిని అభినందించిన ఎమ్మెల్యే గంగుల

## రెండేళ్ల బాలుడిని ముద్దాడి కితాబు

కరీంనగర్, డిసెంబర్ 20(భారతశక్తి ప్రతినిధి):

కరీంనగర్ నగరానికి చెందిన రుద్రాంశ్ విశ్వ అనే రెండు సంవత్సరాల బాలుడు 386 వస్తువుల పేర్లు, రాష్ట్రాలు, దేశాల పేర్లు, శ్లోకాలు గుర్తించడం వల్ల బాలుడి ప్రతిభ గుర్తించి కాలమ్స్ వరల్డ్ రికార్డ్స్, ఎక్స్ట్రార్డినరీ గ్రాస్పింగ్ పవర్ జీనియస్ కిడ్ 2025 అచ్చీవర్ అనే అవార్డ్ ను ఇటీవల ప్రకటించారు.

బాలుని తల్లితండ్రులు ఎమ్మెల్యే గంగులను నివాసంలో



బుధవారం కలిశారు. బాలుడు ఎమ్మెల్యే ను చూడగానే ఎమ్మెల్యే గంగుల అంటూ గుర్తు పట్టారు. సంతోషంతో ఎమ్మెల్యే గంగుల పిల్లాడిని ఎత్తుకున్నారు. ప్రపంచ పటంలోని దేశాలను అలవోకగా గుర్తించి వాటి పేర్లను ఎమ్మెల్యే కు బాలుడు తెలియచేశారు.అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా కలాం వరల్డ్ రికార్డు అవార్డుని బాలునికి అందజేసి అభినందించారు. అబ్బాయి భవిష్యత్తులో మంచి విద్యను అభ్యసించి గొప్ప స్థాయిలో ఉండాలనిఆకాక్షించారు. పిల్లాడిని తీర్చిదిద్దిన తల్లి తండ్రులను గంగుల అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలుడి తల్లి తండ్రులు మాధురి శ్రవణ్ కుమార్, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, బిఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు

# పోలింగ్ ముందు 44 గంటల సైలెన్స్ పీరియడ్ అమలు

**- ప్రచార కార్యక్రమాలపై నిషేధం**

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 10:

గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ దృష్ట్యా, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమావళి మేరకు సంబంధిత మండలాల్లో 'సైలెన్స్ పీరియడ్' అమల్లోకి వస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు.మొదటి విడత లోగుమ్మడిదల,



హత్నూర, కంది, కొండాపూర్, పటాన్చెరు, సదాశివపేట, సంగారెడ్డి మండలాల్లో డిసెంబర్ 09వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచార కార్యకలాపాలపై నిషేధం అమల్లో ఉందని తెలిపారు.రెండవ విడత లోఆందోల్, చౌటకూర్, ఝరాసంగం, కోహిర్, మొగుడంపల్లి, మునిపల్లి, పుల్కల్, రాయికోడ్, వట్పల్లి, జహీరాబాద్ మండలాల్లో డిసెంబర్ 12వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.మూడవ విడతలో కల్హేర్, కంగ్టి, మనూర్, నాగల్ గిద్ద, నారాయణఖేడ్, నిజాంపేట్, సిర్గాపూర్, న్యాల్కల్ మండలాల్లో డిసెంబర్ 15వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలు నిషేధాజ్ఞలు ఉంటాయని తెలిపారు.ఆయా విడతలకు సంబంధించి 44 గంటల సైలెన్స్ పీరియడ్ అమలులో ఉంటుందని, ఈ సమయంలో ఎలాంటి బహిరంగ సమావేశాలు, ఎలక్ట్రానిక్ లేదా ఇతర మీడియా మాధ్యమాల ద్వారా ఎన్నికల ప్రచారం పూర్తిగా నిషేధించబడుతుందని తెలిపారు.జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా సాగేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని ఆమె కోరారు.

# అప్రమత్తతతోనే క్యాన్సర్ అదుపు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



కరీంనగర్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి): క్యాన్సర్ కు భయపడాల్సిన అవసరం లేదని, ముందస్తు పరీక్షల ద్వారా అధిగమించవచ్చని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం శంకరపట్నం మండల కేంద్రంలోని కేంద్రంలోని ఆల్ఫ్రెడ్ నోబెల్ పాఠశాలలో తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో మహిళ ఆరోగ్యం- క్యాన్సర్ స్క్రీనింగ్ పేరిట నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు మల్లేశంతో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాపకింద నీరులా క్యాన్సర్ విస్తరించడం ఆందోళన కలిగించే విషయమే అయినప్పటికీ దీని అదుపు చేయడం కష్టమేమీకాదన్నారు. ప్రజల జీవితాలకు ముప్పుగా పరిణమిస్తున్న క్యాన్సర్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించి ముందస్తు చర్యలపై దృష్టి సారించాలన్నారు. వ్యాధి ముదిరిన తర్వాత గుర్తించడం వల్ల చికిత్స కష్టమవుతుందని ఆయన చెప్పారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా ఈ వ్యాధిని ఎదుర్కోవచ్చన్నారు. ముఖ్యంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ విషయంలో మహిళలు నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ, క్యాన్సర్ నివారణ, ఆధునిక చికిత్సలపై మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను విరివిగా నిర్వహించాల్సిన అవసరం ఉందంటూ ఈ వైద్య శిబిర నిర్వాహకులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి అభినందించారు.

# జర్మనీ నర్సింగ్ జాబ్స్ పేరుతో భారీ మోసం ఆరోపణలు

హైదరాబాద్ డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

మూసారంబాగ్లోని విసా విజన్ కన్సల్టేన్సీ వద్ద బాధితులు అందోళనకు దిగారు. 50 కి పైగా యువత నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. శిక్షణ ఇచ్చి విదేశాలకు పంపిస్తామని చెప్పి, జర్మనీ నర్సింగ్ జాబ్స్ పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేసిన నిర్వాహకులపై విద్యార్థులు విమర్శలు గుప్పించారు. జర్మన్ భాష శిక్షణ, వీసా, వసతి, ఉద్యోగం కల్పిస్తామని చెప్పి మోసపరిచినట్లు బాధితుల ఆరోపణ. నెలలు గడిచినా కన్సల్టెన్సీ డైరెక్టర్ డాక్టర్ రఘువీర రెడ్డి ? సీత స్పందించలేదని బాధితుల వాదన. బాధితులు మలక్పేట్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. త్రం కోటి రూపాయలకు పైగా వసూలు చేసినట్లు సమాచారం. దాడి చేశారని తప్పుడు పిర్యాదు చేసి తమపై బ్లాక్మెయిలింగ్ చేస్తున్నారని విద్యార్థుల ఆరోపించారు. నిర్వాహకుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని బాధితులు అంటున్నారు.

# కాంగ్రెస్...బిఆర్ఎస్ పాలనలో ప్రజల బతుకులు ఆగం

## బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

### బిజెపి జిల్లా అధికార ప్రతినిధి , సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు కళ్యాణ్ చంద్ర

కరీంనగర్, డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి):

దశాబ్దాలు దేశాన్ని రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేని దుస్థితులు ఉన్నాయని, 2014 లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పంచాయతీల పటిష్టత, గ్రామ స్వరాజ్యం కోసం ఎంతో కృషి చేసి, గ్రామాల ముఖచిత్రాన్ని మార్చిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి , సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 55 ఏళ్ళు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ గ్రామాల అభివృద్ధి , ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేసిందేమీలేదని విమర్శించారు. గ్రామాల్లోని మహిళల ఆత్మగౌరవం కోసం ఆలోచన చేయలేని స్థితిలో కాంగ్రెస్ పాలన కొనసాగిందన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక వసతులు రోడ్లు, మురికి కాలువలు , వీధి దీపాలను ఏర్పాటు చేయడంలో దశాబ్దాల కాంగ్రెస్ సర్కార్ విఫలమైందన్నారు. కాంగ్రెస్ పాలనలో నిర్వీర్యమైన పంచాయతీలను, గ్రామాలను పటిష్టం చేయడానికి కేంద్రంలోని మోదీ సర్కార్ కృషి చేసిందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించే లక్ష్యంతో, గ్రామాల రూపురేఖలు మార్చే ఆశయంతో పనిచేస్తుందని తెలిపారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మురికి కాలువలు , వీధి దీపాలు , సెంట్రల్ లైటింగ్ , డంపింగ్ యార్డ్ , స్మశాన వాటికలు , అంగన్వాడి కేంద్రాలు, పల్లె ప్రకృతి వనాలు , రైతు వేదిక లాంటి ఎన్నో ప్రధానమైన పనులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిందన్నారు. గ్రామాల్లో మహిళలు ఆత్మగౌరవంతో జీవించడానికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, కట్టెల పొయ్యి బాధల నుండి మహిళలకు విముక్తి కల్పించాలనే ఉద్దేశంతో ఉజ్వల గ్యాస్ యోజన పథకాన్ని తీసుకో వచ్చిన ఘనత మోది ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నేడు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచుల జీవితాలతో ఆడుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిధులు ఇస్తే , ఆ నిధులను పక్కదారి పట్టించిన చరిత్ర గత కెసిఆర్ సర్కార్ కి ఉందని విమర్శించారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే దయనీయ పరిస్థితులు బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వచ్చాయని తెలిపారు. రెండేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్లను ఆదుకుంటామని , గ్రామ పాలన వ్యవస్థను గాడిలో పెడతామని ఊదరగొట్టు మాటలు చెప్పిందే తప్ప ఆచరణలో చేసిందేమీ లేదన్నారు. అప్పుల పాలైన సర్పంచుల బాధలను పట్టించుకోకుండా, రెండేళ్లుగా గ్రామ పాలనా వ్యవస్థను గాలికి వదిలేసి, పంచాయతీలకు ఒక్క రూపాయి ఇవ్వకుండా గ్రామాలను కాంగ్రెస్ సర్కార్ గోసపెట్టిందన్నారు. రెండేళ్ల కాలంగా గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేసిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు కేంద్రం నుండి రావాల్సిన నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల కోసమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుంది తప్ప పంచాయతీల మీద ప్రేమతో కాదనే విషయాన్ని ప్రజలంతా గ్రహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు, పంచాయతీ సిబ్బంది వ్యయ, నిర్వహణలు సర్దుబాటు చేసుకునే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. సొమ్ము ఒకరి దైతే సోకు మరొకరిది అన్నట్టు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం ఉందని , పూర్తిస్థాయి కేంద్ర ప్రభుత్వం నిధులతో గ్రామాల్లో జరిగిన పనులకు నేటి కాంగ్రెస్ , గత బిఆర్ఎస్ లు తమ క్రెడిట్ అని గొప్పలు చెప్పుకొని ప్రజానీకాన్ని తీవ్రంగా



మోసం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ అభ్యర్థులకు ఓటు వేయడం దండగని , బిజెపి అభ్యర్థులకు ఓటు వేస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ , బిఆర్ఎస్ మాయమాటలకు గ్రామ ప్రజలు మోసపోకుండా , జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో బిజెపికి అవకాశం ఇవ్వాలని కోరారు. కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని , ఆ దిశగా పార్లమెంటు పరిధిలోని అన్ని గ్రామాలలో వందల కోట్ల నిధులు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేయించారని ఆయన ఈ గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధి కేవలం బిజెపితోనే సాధ్యమని , అందుకే పంచాయతీ ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# పల్లె ప్రగతికి ఓటే" ఊపిరి


**(తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు జరగనున్న ఎన్నికల సందర్భంగా ఓటరు చైతన్యం కొరకు రాసిన కవిత)**

ఓటు బుల్లెట్ కంటే బలమైంది
ఓటు మనతల రాతలు
మార్చే ఆయుధం
అవినీతి అక్రమార్కుల
రౌడీ మాఫీయా
ధనస్వాముల నేర
చరితుల రాజకీయాలకు
ఓటుతో వేటు వేయాలి
ఓటరు తనతల రాతను
మార్చి రాసే విశ్వసనీయ
అభ్యర్థులకు ఓటు వేసి
సామాజిక ఆర్థిక సాంస్కృతిక
వికాసానికి మార్గదర్శిగా
నిలువాలి
అభివృద్ధిచేసే సత్తా ప్రగతి శీల
ప్రణాళికలతో ముందుకు వచ్చే
అభ్యర్థులకు ఓటరు మదిలో
చోటు ఇవ్వాలి
రాజకీయ అవినీతి
అక్రమాలకు ఓటుతో
వేయాలి వేటు.
ఎన్నికల్లో ఓటర్లే దేవుళ్ళు
భీరు బిర్యానీ కానుకలకు
లొంగక హామీలు అమలు
చేసి అభివృద్ధికి పాటుపడే
ఉత్తమ అభ్యర్థులకు
ఓటు వేసి ప్రజాస్వామ్య
రక్షకులుగా నిలువాలి
మాయ మాటలు టక్కు
టమార విద్యలతో నూతన
జిమ్మిక్కుల తో నీచెంతకు...
వచ్చే నాయకుల నయా
వంచనకు పొంగిపోకు
మందు విందు వినోదాలకు
లొంగి పోయి ఆదమరచి ఓటు
వేస్తే అవినీతి రాజ్యమేలుతుంది
అవినీతి అక్రమార్కులను
ఓటుతో నిగ్గ తీసిబుద్ధి చెప్పు
అధికారమే ఎజెండాగా
ఎన్నికల్లో గెలుపే
పరమావధిగాపోటీ చేసే
అభ్యర్థులను ఓటుతో
అడ్డుకోవాలి
గ్రామ ప్రగతికి
ఓటే వజ్రాయుధం
సామాన్యుని సాధికారిత
మహిళా యువజన
సాధికారిత సృష్టికి
ఓటే మూలం
అరాచక అక్రమాల దోపిడి
రాజకీయాల అంతం ఓటరు
పంతం కావాలి
ఓటు చైతన్య దీపిక కావాలి..
ఓటు పల్లె ప్రగతికినిజమైన
ఊపిరి...ఓటు పల్లె ప్రజల
జీవితములో వెలుగుకు సాధన
గ్రామ స్వరాజ్యానికి
ప్రాణావాయువు..

ఓటు కొరకు ఎందరినో
పరుగులు తీయిస్తావు.
ఎందరినో ఉరికించి
ఊరడిస్తావు...
నచ్చని అభ్యర్థులను ఓడించి
గద్దిని కరిపిస్తావు ప్రజా జీవిత
నుండి బహిష్కరిస్తావు
ఓటరా నీకు నీవే ధీటు

ప్రపంచంలో ఏదీ రాదు
నీసాటి
ఏపార్టీ అయిన ఏపాటి
నాయకుడైన ఓటును
అర్థించాల్సిందే
ప్రజాస్వామ్య ప్రపంచాన్ని
నడిపించే నాయకులు
ఓటరుకు నలాం
చేయాల్సిందే
ఓటరు నాయకులకు
ఆకర్షణ పుంజం
ఓటే నాయకుల
గుండెల్లో దడ పుట్టిస్తుంది
ఓటరు తీర్పే మార్పుకు
నాంది ఓటు బుల్లెట్ కంటె
బలమైనది ఐదేళ్లకు ఒక సారే
కదా నీవు సార్వభౌముడివి
నీ ఓటు నోటుకు నాటుకు
లొంగొద్దు నీఓటు నీచేతిలో
పాశుపతాస్త్రం
మెరుగైన రాజకీయాల
కొరకు
నీ ఓటే పునాది ..
పోలింగ్ రోజు ఓటు వేయి
ఐదేళ్ల ప్రగతికి బాటెయ్యి
గ్రామాభివృద్ధికి
ఓటే వేగు చుక్క
గెలుపు ఓటములు
ఓటరు చేతుల్లోనే ఉంది
మనీ మందు మత్తులో
పడి పోకు ఓటరు
ప్రజల తలరాతలు
మార్చి రాసే విధాత కావాలి
ప్రజాస్వామ్య విలువల
రక్షకుడిగా నిలచిపో
గ్రామ ఉన్నతి
ఉద్ధరణ నీ చేతిలోనే ఉంది..
ఓటరా నీచైతన్యంతో
కుళ్లు కుతంత్ర
రాజకీయాలకు చెల్లు చీటి
ఓటుతో అవినీతికి
వేయాలి వేటు

నేదునూరి కనకయ్య
( నేదునూరి కళ్యాణ్)
ఫ్రీలాన్స్ రైటర్
అధ్యక్షులు సామాజిక ఆర్థిక
అధ్యయన వేదిక ఉ
తెలంగాణ
ఎకనామిక్ ఫోరం
తెలంగాణ ఎడ్యుకేషన్
ఫోరం
కరీంనగర్
9440245771



# ఎస్పీని కలిసిన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10 (భారత శక్తి):


జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ ను బుధవారం ములుగు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..గత మహా మేడారం జాతరలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేసిన సేవా కార్యక్రమాలు బాగున్నాయని అభినందించారు.గతంలో ఒకే చోట మంచినీటి పంపిణీ జరిగిందని,రానున్న మేడారం మహాజాతరలో రెడ్ క్రాస్ సేవలు మరింత విస్తృతంగా చేస్తూ రెండు మూడు చోట్ల మినరల్ వాటర్ కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందించాలని కోరారు. ఎస్పీ అభినందిస్తూ మీరు చేసే ఉచిత మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాలకు తగిన ఏర్పాట్లుచేస్తామని తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మాట్లాడుతూ..రెడ్ క్రాస్ సొసైటీ ములుగు ఆధ్వర్యంలో గత మేడారం జాతరలో ఉచిత మినరల్ వాటర్ పంపిణీ చేయడం జరిగిందని,రానున్న మహా జాతరలో రెండు లేదా మూడు చోట్ల భక్తులకు మినరల్ వాటర్ పంపిణీ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ములుగు వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్ సెక్రటరీ చుంచు రమేష్,పాలక మండలి సీనియర్ సభ్యుడు కొట్టె రాజి రెడ్డి,సారయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల సంఘం సూచించిన వివిధ రకాల 18 కార్డులను చూపించి ఓటు హక్కు వినియోగించవచ్చు : జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 10: ఓటరు గుర్తింపు కార్డు (ఓటరు ఐడి) ఒక్కటే ప్రధానం కాదని, ఎన్నికల సంఘం సూచించిన వివిధ రకాల 18 కార్డులను చూపించి కూడా... ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు.

గ్రామ పంచాయితీ ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.




18 రకాల గుర్తింపు కార్డుల వివరాలు

1. ఉడై ఆధార్ కార్డు

%-% భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఇచ్చిన ఆధార్.

2. పీహెచ్ఈచ్ (పీహెచ్ సి) ఫోటో

– ఫోటో ఐడెంటిటీగా ఉపయోగించవచ్చు.

3. డ్రైవింగ్ లైసెన్స్

4. రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు

– వీటిలో ఉద్యోగులకు జారీ చేసిన ఐడెంటిటీ కార్డులు.

5. బ్యాంకులు/టి ఎస్ క్యాబ్/డీసీబీస్/కోఆపరేటివ్ సంస్థలు

– ఉద్యోగులకు ఇచ్చే ఫోటో సహిత ఐడెంటిటీ కార్డులు.

6. ఆరోగ్య పథకం (హెల్త్ కార్డు)

– ప్రభుత్వ ఆరోగ్య పథకాల కింద జారీ చేసిన కార్డులు.

7. జాతీయ జనాభా నమోదు ( ఆర్ జి ఐ – ఎన్ పి ఆర్)

– భారత రెజిస్ట్రార్ జనరల్ చేసిన ఎన్ పి ఆర్ క్రింద ఇచ్చే ఐడెంటిటీ పత్రాలు.

8. ఎమ్ఎన్ జి ఆర్ ఇ ఏ లో పనిచేసే కార్మికులకు ఇచ్చే కార్డు.

9) కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసినటువంటి ఫోటోతో కూడిన ఆరోగ్య బీమా పథకం కార్డు (ఇసిక్) (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

10) మాజీ సైనికోద్యోగుల పింఛను పుస్తకం/పింఛను చెల్లింపు ఉత్తర్వు, మాజీ సైనికోద్యోగుల వితంతు/వారిపై ఆధారపడినటువంటి వారి చెందిన ధృవపత్రాలు, వృద్ధుల పింఛను ఉత్తరువు, ఫోటోతో కూడిన వితంతు పింఛను ఉత్తరువులు వంటి ఫోటోతో కూడిన పింఛను పత్రాలు, (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

11) ఎమ్మెల్యే లు/ఎమ్మెల్సీ లకు శాసన సభశాసన మండలి సచివాలయం జారీ చేసినటువంటి ఫోటోతో కూడిన గుర్తింపు కార్డు.

12) ఫోటోతో కూడిన రేషను కార్డు (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

13)ప్రాధికారమివ్వబడినటువంటి అధికారిచే జారీచేసినటువంటి ఫోటోతో కూడిన ఎస్.సి.ఎస్.టి/బి.సి ధృవపత్రం. (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

14) ఫోటోతో కూడిన స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపు కార్డు,

15) ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్సు (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

16) ఫోటోతో కూడిన వికలాంగ ధృవపత్రం (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

17) పార్లమెంటు సభ్యులకు లోక్సభ/రాజ్యసభ సచివాలయం జారీచేసిన ఫోటోతో కూడిన గుర్తింపు కార్డు.

18) ఫోటోతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు (ఎన్నికల ప్రకటన తేదీన లేదా అంతకుముందు జారీ చేసినవి)

వీటితో పాటు ఆన్లైన్ లో కూడా %ంవవ్. స్త్రశీజ.ఱఅ% అనే వెబ్ సైట్ నుండి కూడా ఓటరు స్లిప్ ని డౌన్లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# ఆర్. వి.ఆర్ ఇటుకబట్టిని సందర్శించిన ప్రవాసమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్వదేశ్ పరికిపండ్ల.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 10 (భారత శక్తి):నిర్మల్ ఇటుక బట్టీలో గత సోమవారం ఇటుకను ట్రాక్టర్ నుండి దింపి తిరిగి ఇటుక బట్టి వస్తుండగా ఒక మహిళా కార్మికురాలు మృతి చెందిన ఘటనను పురస్కరించుకొని నిజనిర్ధారణ కోసం ఇటుకబట్టిని సందర్శించడం జరిగింది.సదరు మహిళ భర్త ట్రాక్టర్ను నిర్లక్షంగా నడుపుతుండగా ప్రమాదవశాత్తు భానుమతి (30) పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆ మృతదేహాన్ని నిర్మల్ జిల్లాలోని పోస్టుమార్టం అనంతరం దహన సంస్కారాలు ఇక్కడే చేయడం జరిగింది ఆమె భర్త జగమంద్ ఒక్కడే ఉన్నాడు.



ఇట్టి ఇటుక బట్టీలో అనేక మంది 14 ఏళ్ల లోపు బాలలు కార్మికులు పనిచేస్తూ ఉండడం గమనించి, జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కు కాల్ చేసి సమాచారం అందించారు, అలాగే పని ప్రదేశంలో కార్మికులకు సరైన గృహ వసతి, కార్మికులకు ఎలాంటి రక్షణ లేదు, చిన్న పిల్లలకు, గర్భినిలకు అంగన్వాడి, ఏ ఎన్ ఎమ్ ద్వారా ఎలాంటి పోషకాహారం, మందులు అందడం లేదు, కార్మికులకు వెయ్యి ఇటుకలకు గాను 500 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారు, కనీస వేతనాలు బ్యాంకు ద్వారా చెల్లించడం లేదు, కాబట్టి కార్మిక శాఖ అధికారులు తక్షణం జిల్లాలోని అన్ని ఇటుక బట్టీలను స్పెషల్ డ్రైవ్ కింద ఇన్స్పెక్షన్ చేసి ఒడిశా, మహారాష్ట్ర వలస కార్మికులకు కనీస వసతులు కలిపించి, వారి హక్కులను కాపాడవలసిందిగా కోరారు.

మృతుని కుటుంబానికి తక్షణమే మృతధనం సహాయం, చట్టపరంగా అందించేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

బట్టి యజమాని శేషాద్రి, వెంకట్ రెడ్డిలను కలిసి యూనియన్ నాయకులు సయ్యిద్ ఇల్యాస్ వివరాలు సేకరించి నివేదిక ప్రభుత్వానికి ఇవ్వనున్నారు.

# సిర్పల్లి హెచ్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి గా పోటీలో బీటెక్ యువకుడు

## -ఉన్నత విద్యావంతుల రాజకీయ అరంగేట్రంతో గ్రామీణ ఎన్నికలకు కొత్త ఊపు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 10 (భారత శక్తి): గ్రామీణ రాజకీయాల్లో కొత్త తరంగానికి నాంది పలుకుతూ యువతరం తమ రాజకీయ ప్రయాణానికి పుట్టి పెరిగిన ఊళ్లను పునాదిగా మార్చుకుంటోంది. అనుభవం, రాజకీయ వారసత్వం లేకపోయినా ప్రజాసేవపై ఉన్న ఆసక్తి, గ్రామాభివృద్ధిపై ఉన్న దృఢసంకల్పం కారణంగా చాలామంది ఉన్నత విద్యావంతులు సర్పంచ్ పోటీలో బరిలోకి దిగుతున్నారు.కుబీర్ మండలంలోని సర్పల్లి హెచ్ గ్రామానికి చెందిన బీటెక్ పట్టభద్రుడు ఎర్రేపల్లి సతీష్ కుమార్ ఈసారి సర్పంచ్ అభ్యర్థి పదవికి పోటీ చేస్తున్నారు.మంచి ఉద్యోగావకాశాలు ఉన్నప్పటికీ, గ్రామాభివృద్ధే తన లక్ష్యమని భావించి రాజకీయ చేస్తున్న సతీష్, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఉన్నత విద్యావంతులు పల్లెపోరులో నిలవడం ఎన్నికలకు కొత్త జోష్ తీసుకువస్తోంది. పెద్ద వేతనాలను కూడా వదులుకొని ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో యువత ముందుకు రావడం గ్రామీణ రాజకీయాల్లో సానుకూల మార్పులకు నాంది అని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.సర్పల్లి హెచ్ గ్రామ ప్రజలు యువనాయకుడి అడుగుపై చర్చలు మొదలవగా, అభివృద్ధి ప్రాధాన్య అంశంగా మారింది. ఎర్రేపల్లి సతీష్ పోటీపై గ్రామంలో ఆసక్తి చెలరేగింది. సతీష్ మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇచ్చి ఉంగరం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీ గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు.



# హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ పార్థివ దేహానికి నివాళులర్పించిన సీపీ

కరీంనగర్, డిసెంబర్ 10(భారతశక్త ప్రతినిధి):

గుండెపోటుతో మరణించిన కరీంనగర్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ ఎర్రోజు దేవేందర్(53) పార్థివ దేహానికి కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం బుధవారం నివాళులర్పించారు. కరీంనగర్లోని తీగలగుట్టపల్లిలోని దేవేందర్ నివాసానికి చేరుకున్న సీపీ పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ దేవేందర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబానికి, కుమారులకు ధైర్యం చెప్పారు. కమీషనర్తో పాటు ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ఇన్స్పెక్టర్ కరీముల్లాఖాన్, ఆర్.ఐ. కిరణ్ కుమార్ లతో పాటు కమీషనరేట్కు చెందిన పలువురు పోలీస్ ఉన్నతాధికారులు కూడా నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



# సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు

## డిసెంబర్ 11 న ఉదయం 7.00 నుండి మధ్యాహ్నం 1.00 వరకు పోలింగ్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 10:

గ్రామ పంచాయితి ఎన్నికలు 2025 సందర్భంగా మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు డిసెంబర్ 11 వ తేదిన ఉదయం 7.00 నుండి మధ్యాహ్నం 1.00 వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.






## కొత్త కియా సెల్టోస్ వచ్చేసింది..
# ఫీచర్లు, బుకింగ్ వివరాలు ఇవే!




ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా తన రెండో జనరేషన్ సెల్టోస్‌ను ఆవిష్కరించింది. గట్టి పోటీ ఉన్న మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో అత్యాధునిక హంగులతో 2026 మోడల్ సెల్టోస్‌ను తీసుకొచ్చింది. ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ పరంగా కొన్ని మార్పులు చేశారు. ఈ కారు ధరను జనవరి 2న కంపెనీ వెల్లడించనుంది. డిసెంబర్ 11 నుంచి బుకింగ్‌లు ప్రారంభమవుతాయని, రూ.25 వేలు చెల్లించి కారును బుక్ చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. టాటా సియారా, హ్యుందాయ్ క్రెటా, మారుతీ సుజుకీ గ్రాండ్ విటారా, టయోటా అర్బన్ క్రూయిజర్ హైరైడర్, హోండా ఎలివేట్ వంటి మోడళ్లకు పోటీ ఇవ్వనుంది. కొత్త కియా సెల్టోస్ డిజైన్ విషయానికొస్తే.. గ్లోబల్ మోడల్ నుంచి స్ఫూర్తితో టైగర్ నోజ్ గ్రిల్‌తో తీసుకొచ్చారు. దీనికి వర్టికల్ లైటింగ్ ఎలిమెంట్లు జోడించారు. ఈ ఎస్‌యూవీలో 18 అంగుళాల అలాయ్ వీల్స్ ఇచ్చారు. కనెక్టెడ్ టైల్ లైట్లతో కూడిన అప్‌డేటెడ్ టైల్‌గేట్‌ను ఇచ్చారు. ముందూ వెనుక గన్‌మెటల్ ఫినిష్ స్కిడ్ ప్లేట్లతో కూడిన కొత్త బంపర్లు ఉన్నాయి. పనోరమిక్ సన్‌రూఫ్, ఇంటిగ్రేటెడ్ రియర్ స్పాయిలర్, షార్క్ ఫిన్ యాంటెన్నా వంటివి ఉన్నాయి. మొత్తం 10 బాడీ పెయింట్ ఆప్షన్లతో తీసుకొచ్చారు. ఇందులో మార్నింగ్ హేజ్, మాగ్మా రెడ్ కొత్తవి. ఈ సెగ్మెంట్‌లో అత్యంత పొడవైన కారు (4,460 మి.మీ.) ఇదేనని కంపెనీ తెలిపింది. 1,830 మి.మీ. వెడల్పు, 1635 మి.మీ. ఎత్తు, 2690 మి.మీ. వీల్‌బేస్‌తో వస్తోంది. గతంతో పోలిస్తే వీల్‌బేస్ 80 మిల్లీమీటర్లు పెరిగింది. ఇక ఇంటీరియర్ పరంగా చూస్తే.. క్యాబిన్ డిజైన్‌ను కూడా అప్‌డేట్ చేశారు. వీల్‌బేస్ పెరగడం వల్ల లెగ్‌రూమ్ కూడా ఆ మేర పెరిగింది. ఇందులో 12.3 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 12.3 అంగుళాల హెచ్‌డీ టచ్‌స్క్రీన్ సింగిల్ ప్యానెల్ విజువల్ కమాండ్ సెంటర్ ఉన్నాయి. ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, 64 కలర్ యాంబియెంట్ మూడ్ లైటింగ్, డీ కట్ డ్యూయల్ టోన్ లెదర్ స్టీరింగ్ వీల్‌ను ఇచ్చారు. 6 ఎయిర్‌బ్యాగులు, ఈఎస్‌పీ, హిల్ స్టార్ట్ అసిస్ట్, అన్ని వీల్స్‌కు డిస్క్ బ్రేకులు, 360డిగ్రీ కెమెరా, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, OTA అప్‌డేట్లతో కూడిన రిమోట్ కంట్రోల్ వంటివి ఉన్నాయి. లేన్ కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్, నావిగేషన్ బేస్డ్ స్మార్ట్ క్రూజ్ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి లెవల్ 2 అడాస్ ఫీచర్లు ఉన్నాయి. స్నో, మడ్, సాండ్ మోడల్‌లు ఉన్నాయి. 1.5 లీటర్ నేచరల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ (115 హెచ్‌పీ, 144 Nm), 1.5లీటర్ టర్బో పెట్రోల్ (160 హెచ్‌పీ, 253 Nm), 1.5లీటర్ డీజిల్ (116 హెచ్‌పీ, 250 Nm) ఇంజిన్ ఆప్షన్లతో వస్తోంది. ఎంటీ, ఐవీటీ, డీసీటీ, ఏటీ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లతో తీసుకొచ్చారు. ఈ కారు ధర, ఇతర వివరాల గురించి నెటిజన్లు ఆరా తీయడంతో గూగుల్ ట్రెండ్స్‌లో కొనసాగుతోంది.

## వెండి రికార్డు స్థాయికి..
# కిలో రూ.2 లక్షలకు కాస్త దూరంలో!



నిన్నమొన్నటి వరకు పసిడి గురించి మాట్లాడుకున్నవారంతా నేడు వెండి ధర గురించి చర్చించుకుంటున్నారు. బంగారంతో పాటు ఇన్నాళ్లు పెరిగిన వెండి.. ఇప్పుడు పసిడిని దాటేసి పరుగులు పెడుతోంది. తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా ఔన్సు 60 డాలర్లు దాటేసింది. దీన్ని అనుసరించి దేశీయంగానూ వెండి ధర భారీగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం రూ.1.92 లక్షలు పలుకుతోంది. సరిగ్గా ఏడాది క్రితం తొలిసారి రూ.లక్ష మార్కును దాటిన వెండి.. ఇప్పుడు రూ.2 లక్షల మార్కు దిశగా దూసుకెళుతోంది. అంతర్జాతీయ విపణిలో గత కొన్ని రోజులుగా 50 డాలర్లు పైన ట్రేడయిన వెండి ఒక్కసారిగా దాదాపు 5 శాతం మేర పెరిగింది. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, సరఫరాలో అంతరాలు దీనికి కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. ఫెడ్ వడ్డీ రేట్లను పావు శాతం మేర తగ్గిస్తుందన్న అంచనాలు ఈసారి బలంగా ఉన్నాయి. రేట్ల కోత చేపట్టినప్పుడు సాధారణంగా బంగారం, వెండి వంటి లోహాలకు డిమాండ్ పెరుగుతుంది. వడ్డీ రేట్ల కోత ప్రకటించాక వీటి రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకప్పుడు కేవలం ఇంట్లో వస్తువులు, ఆభరణాలకు మాత్రమే వెండిని వినియోగించేవారు. కానీ, పారిశ్రామికంగానూ వెండి అవసరం పెరుగుతుండడంతో దీనికి డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్, ఈవీ కాంపోనెంట్స్‌లో దీని వినియోగం పెరిగింది. అవసరాలకు అనుగుణంగా వెండి ఉత్పత్తి పెరగకపోవడంతో ఈ లోహానికి డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలోనే గతంలో బంగారం ధర 59 శాతం మేర పెర్గగా.. వెండి ధర ఏకంగా 107 శాతం మేర పైకెగిసింది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి కిలో వెండి రూ.1.92 లక్షల వద్ద ఉంది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.32 లక్షలు పలుకుతుండగా.. ఆర్నమెంట్‌కు వినియోగించే 22 క్యారెట్ల పసిడి ధర రూ.1.20 లక్షల వద్ద ఉంది.

## 2030 నాటికి భారత్‌లో 35 బిలియన్ డాలర్ల పెట్టుబడులు..
# పది లక్షల ఉద్యోగాలు: అమెజాన్ ప్రకటన




2030 నాటికి భారత్‌లో వివిధ వ్యాపారాల్లో 35 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెడతామని ప్రముఖ ఇకామర్స్ సంస్థ అమెజాన్ వెల్లడించింది. ఉపాధి కల్పన, వ్యాపార విస్తరణ కోసం ఈ ప్రణాళికలను ప్రకటించింది. దిల్లీలో జరిగిన అమెజాన్ సంభవ్ సమిట్‌లో ఈ ప్రకటన చేసింది. గత 15 ఏళ్లలో భారత్‌లో అమెజాన్ 40 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టింది. భారతదేశ విస్తృత డిజిటల్, ఆర్థిక ప్రాధాన్యతలకు అనుగుణంగా ఏఐ ఆధారిత డిజిటలైజేషన్, ఎగుమతి వృద్ధి, ఉద్యోగ సృష్టి లక్ష్యంగా ఈ పెట్టుబడులు ఉంటాయని వెల్లడించింది. అమెజాన్ ఇప్పటివరకు 12 లక్షల వ్యాపారాలను డిజిటలైజ్ చేసిందని, 2024లో సుమారు 2.8 మిలియన్ల మందికి ప్రత్యక్ష, పరోక్ష, సీజనల్ ఉద్యోగాలు లభించాయని పేర్కొంది. 2030 నాటికి అదనంగా 10 లక్షల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా పెట్టుకుంది. ''గత 15 ఏళ్లుగా భారత్ డిజిటల్ ప్రయాణంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది. మా సంస్థ వృద్ధి.. భారత ప్రభుత్వ ఆత్మనిర్భర్, వికసిత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. భారత్‌లో చిన్న వ్యాపారాలకు డిజిటల్ మౌలిక సదుపాయాలను అందించడంలో, లక్షలాది ఉద్యోగాలను సృష్టించడంలో, మేడ్ ఇన్ ఇండియాను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లే దిశగా మేం భారీగా పెట్టుబడులు పెట్టాం'' అని అమెజాన్‌లో ఎమర్జింగ్ మార్కెట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ అన్నారు. కొత్త పెట్టుబడుల గురించి ప్రకటన చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

# వన్డేల్లో రెండో ర్యాంక్‌కు చేరుకున్న విరాట్ కోహ్లీ



ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. అలాగే మొదటి స్థానానికి అతి చేరువగా వచ్చాడు! ప్రస్తుతం ఆ స్థానంలో రోహిత్ శర్మ ఉన్నాడు. అంతకు ముందు నాలుగో స్థానంలో ఉన్న విరాట్ కోహ్లీ.. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్, అఫ్గానిస్థాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్‌ను వెనక్కి నెట్టి రెండు స్థానాలు ఎగబాకాడు. తాజాగా దక్షిణాఫ్రికాతో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో విరాట్ కోహ్లీ రెండు వరుస సెంచరీలు(135, 102) , ఒక హాఫ్ సెంచరీతో (65*) అద్భుతంగా రాణించాడు. ఈ టోర్నీలో అతడు ఏకంగా 302 రన్స్ రాబట్టి, అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శనలతో వన్డే ర్యాంకింగ్స్‌లో 773 పాయింట్లతో రెండో స్థానానికి దూసుకెళ్లాడు. మొదటి స్థానంలో ఉన్న రోహిత్ శర్మ ఖాతాలో 781 పాయింట్లున్నాయి. రోహిత్, విరాట్‌కు మధ్య అంతరం కేవలం ఎనిమిది పాయింట్లే కావడం గమనార్హం. బౌలర్ల విభాగంలో కుల్‌దీప్ యాదవ్ మూడు స్థానాలు ఎగబాకి నం.3 స్థానానికి చేరుకున్నాడు. మొదటి స్థానంలో అఫ్గానిస్థాన్ క్రికెటర్ రషీద్ ఖాన్, రెండో ప్లేస్‌లో ఇంగ్లాండ్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ ఉన్నారు. దక్షిణాఫ్రికాతో ముగిసిన వన్డే సిరీస్‌లో కుల్‌దీప్ యాదవ్ తొమ్మిది వికెట్లతో లీడింగ్ వికెట్ టేకర్‌గా ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో అఫ్గానిస్థాన్ క్రికెటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ మొదటి స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

*** ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే బ్యాటర్ల ర్యాంక్‌లు**

1. రోహిత్ శర్మ (భారత్) 781
2. విరాట్ కోహ్లీ (భారత్) 773
3. డెరిల్ మిచెల్ (న్యూజిలాండ్) 766
4. ఇబ్రహీం జద్రాన్ (అఫ్ఘానిస్థాన్) 764
5. శుభ్‌మన్ గిల్ (భారత్) 723
6. బాబర్ అజామ్ (పాకిస్థాన్) 722
7. హ్యారీ టెక్టర్ (ఐర్లాండ్) 708
8. షాయ్ హోప్ (వెస్టిండీస్) 701
9. చరిత్ అసలంక (శ్రీలంక) 690
10. శ్రేయస్ అయ్యర్ (భారత్) 679





# వారిద్దరి కంటే మెరుగైన ఆటగాళ్లున్నారా?

**: హర్భజన్ సింగ్**



రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం కేవలం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. వన్డే వరల్డ్ కప్ 2027లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికాతో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లో వీరు తమ సత్తా చాటారు. రోహిత్ శర్మ.. రాంచీ, విశాఖపట్నం వన్డేల్లో హాఫ్ సెంచరీలు (57, 75) సాధించాడు. మరోవైపు కోహ్లీ మొదటి రెండు వన్డేల్లో వరుస సెంచరీలు (135, 102), మూడో వన్డేలో హాఫ్‌సెంచరీతో (65*) అద్భుతమైన ఫామ్‌తో వింటేజ్ విరాట్‌ను గుర్తుకుతెస్తున్నాడు. ఓవరాల్‌గా 302 రన్స్‌తో సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో వీరి గురించి టీమ్ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా మాట్లాడాడు. 'రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కంటే.. మెరుగైన ఆటగాళ్లున్నారా? కాబట్టి వారిని జట్టు నుంచి తప్పించకూడదు. దానికి బదులుగా వారి అనుభవాన్ని యువ క్రికెటర్లు ఉపయోగించుకునేలా జట్టును రూపొందించాలి. టీమ్ మొత్తాన్నీ యువ క్రికెటర్లతో నింపాలని చూస్తే.. పెద్ద మ్యాచుల్లో ఇబ్బందిపడాల్సివస్తుంది. అందుకే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని రానున్న వన్డే వరల్డ్‌కప్‌లో కచ్చితంగా ఆడించాలి. ఆ తర్వాత వారు మరో వరల్డ్ కప్ ఆడే అవకాశమే లేదు కదా' అని హర్భజన్ సింగ్ విశ్లేషించాడు. 'రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రస్తుతం చేస్తున్న బ్యాటింగ్‌ను చూస్తుంటే.. టీమ్ఇండియా చాలా బలంగా కనిపిస్తోంది. వారు తమ ఫిట్‌నెస్‌నూ చక్కగా కాపాడుకుంటున్నారు. అయితే వారు వరల్డ్ కప్ ఆడేందుకు అవకాశం దక్కుతుందా? లేదా? అనే విషయంలోనే సందిగ్ధత ఉంది. యువ ఆటగాళ్లను ఆడించడంలో తప్పులేదు. కానీ.. అదే సమయంలో మ్యాచ్‌లను మలుపు తిప్పే ఇన్నింగ్స్ ఆడగల సామర్థ్యమున్న సీనియర్లనూ విస్మరించకూడదు' అని హర్భజన్ సింగ్.. టీమ్ఇండియా యాజమాన్యానికి సూచించాడు. 'గత వరల్డ్ కప్‌లోనూ టీమ్ఇండియా ఫైనల్‌లో ఓడిపోయింది. పిచ్ చాలా స్లోగా ఉండటమే దీనికి కారణం. మంచి పిచ్ మీద గనక ఆడిఉంటే.. ఫలితం మరోలా ఉండేది. ఆస్ట్రేలియా ఒత్తిడిలోనూ బాగా ఆడింది. అందుకే టీమ్ఇండియాపై విజయం సాధించింది. అయితే రోహిత్‌శర్మ సారథ్యంలో భారత జట్టు అద్భుత ప్రదర్శనలు చేసింది. అందుకే మొదట రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను జట్టులోకి తీసుకున్నాకే, మిగతా ఆటగాళ్లను ఎంపిక చేయాలి' అని హర్భజన్ సింగ్ కుండబద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

# సంజుశాంసన్ నాకు పెద్దన్నలాంటోడు: జితేశ్ శర్మ



మరి కొన్ని నెలల్లోనే టీ20 వరల్డ్‌కప్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో జట్టులో వికెట్ కీపర్ స్థానం కోసం సంజుశాంసన్, జితేశ్ శర్మ మధ్య తీవ్రమైన పోటీ ఉంది. కటక్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో సెలక్టర్లు జితేశ్ శర్మ వైపే మొగ్గు చూపారు. దీంతో సంజుశాంసన్ తుది జట్టులో స్థానం సంపాదించుకోలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో జితేశ్ శర్మ 10 పరుగులతో (5 బంతుల్లో, 1 ఫోర్) నాటౌట్‌గా నిలిచాడు. మొదటి టీ20లో టీమ్ఇండియా ఒకనొక దశలో 78 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. అయినప్పటికీ హార్దిక్ పాండ్య (59*; 28 బంతుల్లో, 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ బ్యాటింగ్, తిలక్ వర్మ (26; 32 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (23; 21 బంతుల్లో, 2 సిక్స్‌లు) సమయోచిత ఇన్నింగ్స్‌తో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 6 వికెట్లు నష్టపోయి 175 పరుగులు చేయగలిగింది. టీమ్ఇండియా బౌలర్లు విజృంభించడంతో దక్షిణాఫ్రికా 74 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఈ మ్యాచ్‌లో భారత జట్టు 101 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ అనంతరం జితేశ్ శర్మ.. తనకు, సంజుశాంసన్ మధ్య ఉన్న అనుబంధాన్ని గురించి మాట్లాడాడు. 'అతడు జట్టులో ఉన్నందుకు ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే సంజుశాంసన్ నాకు పెద్దన్నలాంటోడు. ఆరోగ్యకరమైన పోటీ ఉన్నప్పుడు, మనలో దాగున్న ప్రతిభ బయటకు వస్తుంది. ఇది జట్టుకు కూడా ఎంతో మంచిది. సంజుశాంసన్ అద్భుతమైన ఆటగాడు. మేమిద్దరం టీమ్ఇండియా తరపున ఆడుతున్నాం. మేం సోదరుల్లాంటివారం. అతడు నాకు చాలా సాయం చేశాడు' అని జితేశ్ శర్మ అన్నాడు. సంజుశాంసన్ 2024లో టీ20 ఫార్మాట్‌లో మూడు సెంచరీలు చేశాడు. కానీ.. శుభ్‌మన్ గిల్ వైస్‌కెప్టెన్‌గా నియమితుడయ్యాక అతడికి టాప్‌ఆర్డర్‌లో చోటు దక్కడం లేదు. అప్పటినుంచి సంజుశాంసన్ మిడిలార్డర్, లోయరార్డర్‌లో బ్యాటింగ్‌కు వస్తున్నాడు. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టీ20లో ఏకంగా జట్టులో స్థానమే కోల్పోయాడు.

# రహమాన్ డకైత్.. మనుషులను చంపి ఫ్యాన్‌కు వేలాడదీసేవాడు

‘ధురంధర్’.. ఈ బాలీవుడ్ సినిమా బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. ఆదిత్యధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన స్పై థ్రిల్లర్‌లో నటీనటుల యాక్టింగ్‌కు ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సినిమా రిలీజ్ అయిన దగ్గరినుంచి రహమాన్ డకైత్ పాత్రలో జీవించిన అక్షయ్ ఖన్నా పేరు నెట్టింట్లో తెగ వైరల్ అవుతోంది. ఆయన వేసిన స్టెప్పులకు ప్రేక్షకులు సర్‌ప్రైజ్ అయ్యారు. బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ కూడా ఈ స్టెప్పులకు కాలు కదిపారు. దీంతో అసలు ఎవరీ డకైత్ అని నెటిజన్లు ఆరా తీస్తున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ధురంధర్ సినిమాలో పాకిస్థాన్ నగరం కరాచీలోని లియారీ ప్రాంతంలో 20 ఏళ్ల క్రితం చోటుచేసుకున్న పరిణామాలను చూపించారు. ఆ లియారీ ప్రాంతం నేరకార్యకలాపాలకు స్థావరంగా ఉండేది. అక్కడే సర్దార్ అబ్దుల్ రహమాన్ బలోచ్ 1979లో జన్మించాడు. రహమాన్ డకైత్‌గా పాపులర్ అయ్యాడు. అతడి కుటుంబం కూడా స్మగ్లింగ్ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉండేది. తుపాకులు, గ్యాంగ్ వార్లు చూస్తూ పెరిగిన అతడు చిన్నవయసులోనే నేర సామ్రాజ్యంలోకి ఎంటర్ అయ్యాడు. 13 ఏళ్ల వయసులోనే ఒక వ్యక్తిని పొడిచి చంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. తన




కన్నతల్లిని గొంతునులిమి, సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడదీసి చంపేశాడని స్థానిక కథనాలు వెల్లడించాయి. ఈ తర్వాత నుంచి అతడిలో నేరప్రవృత్తి పెరిగిందని, హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడేవాడని పేర్కొన్నాయి. 1990ల చివర్లో హాజీ లాలూ గ్యాంగ్‌లో చేరాడు. 2001లో లాలూ అరెస్టు కావడంతో ఆ గ్యాంగ్‌ను తన నియంత్రణలోకి తెచ్చుకున్నాడు. మాదకద్రవ్యాల అక్రమరవాణా, జూదం, దోపిడీ వంటి నేరాలతో 2000 సంవత్సరంలోకి వచ్చేసరికి లియారీలోని చాలా ప్రాంతాలపై పట్టుసాధించాడు. అక్కడి ప్రజలు తనకు విధేయత చాటుకునేలా ఆ అక్రమ సొమ్మును క్లినిక్‌లు, స్థానిక పాఠశాలలు, మదర్సాలకు విరాళంగా ఇచ్చేవాడు. ఫుట్‌బాల్ టోర్నమెంట్లు నిర్వహించేవాడు. ఉజైర్ బలోచ్, బాబా లడ్లా అతడి అనుచరులు. వీరిద్దరు తెగిపడిన తలలతో ఫుట్‌బాల్ ఆడుకునేవారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఇక, 2000 చివరికి వచ్చే సరికి లియారీ ప్రాంతంలో గ్యాంగ్‌వార్స్ ఎక్కువయ్యాయి. అప్పట్లో అధికారంలో ఉన్న పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఆ నేరాలను చూసీచూడనట్టు వదిలేసేది. పాకిస్థాన్ డర్టీ హ్యారీగా పిలవబడే చౌధ్రీ అస్లామ్ ఖాన్.. 1980ల్లో సింధ్ పోలీసు విభాగంలో చేరాడు. తర్వాత క్రైమ్ ఇన్వెస్టిగేటింగ్ డిపార్ట్‌మెంట్, లియారీ టాస్క్ ఫోర్స్‌కు నాయకత్వం వహించాడు. అతడు తాలిబన్లు, గ్యాంగ్‌లపై కఠినంగా వ్యవహరించేవాడు. 2009లో పోలీసు ఎన్‌కౌంటర్‌లో డకైత్‌ను మట్టుపెట్టాడు. అస్లామ్ పాత్రను సంజయ్ దత్ పోషించాడు. 2014లో జరిగిన ఆత్మాహుతి దాడిలో అస్లామ్ ప్రాణాలు కోల్పోయాడు. ఇక ఈ సినిమాలో అరబిక్ సాంగ్ బ్యాగ్రౌండ్‌లో వినిపిస్తుంటే.. డకైత్ పాత్రధారి అక్షయ్ ఖన్నా ఎంట్రీ అదుర్స్ అనిపించింది. ఆ డ్యాన్స్‌కు బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ కూడా ముగ్ధురాలైంది. ఆమె కూడా ఎయిర్‌పోర్ట్‌లో ఆ స్టెప్పులేసిన వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇక సినిమా చూసిన వారంతా ‘షో స్టీలర్’, ‘కమ్‌బ్యాక్ కింగ్’ అంటూ అక్షయ్‌ను పొగిడేస్తున్నారు. దీనికి ముందు మరో బాలీవుడ్ హిట్ మూవీ ‘ఛావా’లో ఆయన నటించిన సంగతి తెలిసిందే. అందులో మొఘల్ పాలకుడు ఔరంగజేబు పాత్రలో అలరించారు. 1999లో వచ్చిన తాల్ సినిమాలో ప్రేమికుడిగా, ఇటీవలి దృశ్యమ్ 2లో పోలీసు అధికారిగా ఇలా పలు భిన్నమైన పాత్రలతో ఆయన ప్రేక్షకులను అలరిస్తున్నారు.




## టాలీవుడ్‌లోకి ‘మిస్ యూనివర్స్ ఇండియా 2024’..
## ఫస్ట్ లుక్ రిలీజ్

అందాల కిరీటం గెలిచి, సినిమాల్లోకి అడుగుపెట్టి ప్రేక్షకులను అలరించిన వారెందరో. ఇప్పుడు మరో బ్యూటీ చిత్ర పరిశ్రమకు పరిచయమవుతోంది. తెలుగు సినిమాతోనే నట ప్రయాణం మొదలుపెట్టడం విశేషం. ఆమే.. రియా సింఘా. కమెడియన్ సత్య హీరోగా ‘మత్తు వదలరా’ ఫేమ్ రితేశ్ రాణా తెరకెక్కిస్తున్న ‘జెట్లీ’లో హీరోయిన్‌గా నటిస్తోంది. రియాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. యాక్షన్‌కు ప్రాధాన్యమున్న పాత్ర పోషిస్తున్నట్లు పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. ఈ సినిమాలో శివానీ రాయ్‌గా సందడి చేయనుంది. గుజరాత్‌కు చెందిన రియా.. 18 ఏళ్ల వయసులోనే మిస్ యూనివర్స్ ఇండియా 2024 టైటిల్ గెలుచుకుంది. అంతకు ముందు ఏడాదిలో ‘మిస్ టీన్ గుజరాత్’, ‘మిస్ టీన్ ఎర్త్’ కిరీటాలు దక్కించుకుంది. మిస్ టీన్ గుజరాత్ గెలిచిన తొలి గుజరాతీ అమ్మాయి రియానే. ‘మిస్ యూనివర్స్ 2024’ టాప్ 30లో నిలిచింది. చిన్నతనం నుంచే చదువులో చురుగ్గా ఉండే ఆమె.. పాఠశాల దశ నుంచే మోడలింగ్ చేస్తోంది. టెడెక్స్ స్పీకర్ కూడా. పెర్ఫామింగ్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేసింది.

## సినిమాను ఇలానే తీయాలి అని రూల్స్ లేవు: కార్తి



సినిమాను తెరకెక్కించడంలో ఎలాంటి రూల్స్ లేవని నటుడు కార్తి అన్నారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన చిత్రం ‘అన్నగారు వస్తారు’. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమా డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కార్తి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ‘‘సినిమాను ఇలానే తీయాలి అని రూల్స్ ఉండవు. మనకు నచ్చినట్లు ప్రేక్షకులకు నచ్చేవిధంగా తెరకెక్కించవచ్చు. ఈ విషయంలో ఎవరి వ్యక్తిగత నిర్ణయం వారిది. ఎవరికి నచ్చినట్లు వాళ్లు రూపొందిస్తారు. ఈ విషయంలో ఎవరూ ఎవరికీ నేర్పించలేరు. మనం చిన్నప్పటి నుంచి చూసిన సినిమాల ప్రభావం మనపై ఎక్కువగా ఉంటుంది. మంచి చిత్రాలు రూపొందిస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరణ చూపిస్తారు. ‘అన్నగారు వస్తారు’లో మంచి ఫైటింగ్ సీన్స్ ఉన్నాయి. అవి సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయి’’అని చెప్పారు. ఇక తాను ఇండస్ట్రీకి రావడానికి ముందు అమెరికాలో వర్క్ చేసినట్లు కార్తి తెలిపారు. ‘‘నేను అమెరికాలో మూడు సంవత్సరాలు చదువుకున్నాను. అక్కడ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసి ఇక్కడకు వచ్చాను. నేను చదువు మానేసి సినిమాల్లోకి వెళ్తాను అని చెప్పగానే అక్కడి వాళ్లందరూ షాక్ అయ్యారు. నువ్వు ఇంత మంచి స్టూడెంట్‌వి సినిమాల్లోకి ఎందుకు వెళ్లడం అన్నారు. ఆ రంగానికి వెళ్లకు కెరీర్ మొత్తం పాడైపోతుంది అన్నారు. నేను ఇండస్ట్రీకి రావడానికి మా కుటుంబం చాలా సపోర్ట్ చేసింది’’ అని వెల్లడించారు.

## నా మనవళ్లు పెద్దవాళ్లు అయినా..
### ఆ హీరో మాత్రం యంగే: విజయ్ సేతుపతి



నాగార్జునను తాను ఎన్నో ఏళ్లుగా గమనిస్తున్నానని ఆయన వయసులో ఏమాత్రం తేడా రాలేదని విజయ్ సేతుపతి అన్నారు. తాజాగా జియో హాట్‌స్టార్ నిర్వహించిన ‘సౌత్ అన్‌బాండ్’ కార్యక్రమంలో నాగార్జున, మోహన్‌లాల్, విజయ్ సేతుపతి సందడి చేశారు. ఆ వేదికపై విజయ్ సేతుపతి మాట్లాడుతూ నాగార్జునపై సరదా కామెంట్స్ చేశారు. ‘‘నా చిన్నప్పుడు నాగార్జున ఎలా ఉన్నారో, ఇప్పటికీ అలానే ఉన్నారు. ఆయనకు వయసు ఎందుకు పెరగడం లేదో నాకు అర్థం కావట్లేదు. ‘యాంటీ ఏజింగ్’పై పరిశోధనలు చేసేవారు ఆయన్ని తీసుకెళ్లి కొన్ని రోజులు పరీక్షించాలి. ఆయన జుట్టు కూడా అప్పటి నుంచి ఇప్పటి వరకూ అలానే ఉంది. ఎనర్జీ కూడా ఏమాత్రం తగ్గలేదు. నాకు మనవళ్లు పుట్టి వాళ్లు పెద్దవాళ్లు అయినా కూడా నాగార్జున మాత్రం ఇలానే ఉంటారు’’ అని సరదాగా అన్నారు.

# సినిమా

## టైటిల్ రివీల్

టాలీవుడ్‌సీనియర్‌హీరో విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ సంబంధించిన టైటిల్ ను అనౌన్స్‌మెంట్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి ‘ఆదర్శ కుటుంబం’ అంటూ క్లాస్ టైటిల్‌ను పెట్టారు. ఇందులోనే హౌస్ నెంబర్ 47, ఏకే 47 అంటూ కూడా హైలైట్ చేయడం విశేషం. ఈ సందర్భంగా రిలీజ్‌చేసిన ఫస్ట్ లుక్ లో వెంకీ మామ మంచి ఫ్రెష్ గా, ఫ్యామిలీ మ్యాన్‌ల కనిపిస్తున్నాడు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇవాళ్టి నుంచే ప్రారంభం కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా శ్రీనిధి శెట్టిని తీసుకోబోతున్నట్లు సమాచారం. అలాగే ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. గతంలో వెంకటేశ్, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన ‘నువ్వు నాకు నచ్చావ్’, ‘మల్లీశ్వరి’ చిత్రాలు ఫ్యామిలీ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అయితే ఇన్నేళ్ల తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నాడు. .మ్యూజిక్ డైరెక్టర్ గా ‘యానిమల్’ ఫేమ్ హర్ష వర్ధన్ రామేశ్వర్ ను ఫిక్స్‌చేసినట్లు తెలుస్తోంది.




## 20 ఏండ్ల త్యాగం

తెలుగు, హిందీతో పాటు హాలీవుడ్‌లోనూ వరుస ప్రాజెక్టులు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తున్న స్టార్ నటి ప్రియాంక చోప్రా. ఈ అమ్మడు చివరిసారిగా హెడ్స్ ఆఫ్ స్టేట్ లో కనిపించింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ఇది స్ట్రీమింగ్ అవుతోంది. ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి, ప్రిన్స్‌మహేశ్ బాబు కాంబోలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న ‘వారణాసి’లో నటిస్తోంది. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన సినీ కెరీర్ గురించి, వ్యక్తిగత జీవితంలో చేసిన త్యాగాలను గుర్తుచేసుకుంటూ ఎమోషనల్ అయ్యింది. ‘నేను ఇండస్ట్రీకి వచ్చినప్పుడు ఎలాంటి సినిమాలు సెలెక్ట్‌చేసుకోవాలో తెలియలేదు. వచ్చిన ప్రతి ప్రాజెక్ట్‌ను ఒప్పుకున్న. అసలు చాన్స్‌లు రావడమే అదృష్టమని భావించాను. దీంతో ఎలాంటి క్యారెక్టర్‌కు అయినా ఓకే చెప్పేదాన్ని. 20 ఏండ్ల వయసులో ఖాళీ లేకుండా ప్రాజెక్టులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న. ఇప్పుడు నా త్యాగానికి అవతలి వైపు చూస్తున్నట్లు ఉంది. నేనెంత కష్టపడ్డానో నా కు మాత్రమే తెలుసు. ఈ జర్నీలో నా బర్త్ డేస్‌మిస్ అయ్యాను. ఆఖరికి నా తండ్రి హాస్పిటల్ లో ఉంటే ఆయన చివరి రోజుల్లోనూ నేను చూసుకోలేకపోయాను. పండగలు సెలబ్రేట్ చేసుకోలేదు. నా ఫ్యామిలీతో గడిపిన సందర్భాలూ చాలా తక్కువ. ఆ సమయంలో అంత కష్టపడ్డాను కాబట్టి ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. ఇప్పుడు నాకు నచ్చిన స్క్రిప్ట్‌లకు మాత్రమే ఓకే చెబుతున్న. 20 ఏండ్ల త్యాగం చేసి నేడు ఇలా ఉన్న’ అంటూ ప్రియాంక చెప్పుకొచ్చింది.



## వాళ్ల వల్లే స్వేచ్ఛగా..

సామాజిక సేవా కార్యక్రమాలతో బిజీ బిజీగా ఉండే నటి రేణూ దేశాయ్ తాజాగా ఓ సినిమా గురించి ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. ‘ప్రతి భారతీయుడు తప్పక చూడాల్సిన సినిమా ధురంధర్. దర్శకుడు ఆదిత్య ధర్ ఒక బ్రిలియంట్ మాస్టర్ పీస్ ఇచ్చాడు. మనల్ని రోజూ క్షేమంగా ఉంచడానికి ఇండియన్ ఆర్మీ, మన రక్షణ దళాలు 24×7 కష్టపడుతున్నరు. వాళ్ల వల్లే మనం ఈ రోజు స్వేచ్ఛగా ఉండగలుగుతున్నం. ఈ సినిమా చూస్తే ఆ విషయం మరింత లోతుగా అర్థమవుతుంది. ఇకనైనా కొందరు ‘సూడో సెక్యులర్స్’ గా తయారై, దేశం మీద మాట్లాడే హక్కు లేదని నిరూపించుకుంటూ తిరిగే వాళ్లు ఈ చిత్రం చూడాలి. కనీసం కొంచెం అయినా దేశం పట్ల గౌరవం నేర్చుకోవాలి. ప్రతి ఒక్కరూ మన దేశం పక్షాన నిలబడాల్సిన సమయం ఇది’ అంటూ రాసుకొచ్చింది. రేణూ షేర్ చేసిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇక దేశభక్తి నేపథ్యంలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన స్పై థ్రిల్లర్ ‘ధురంధర్’లో రణ్‌వీర్ సింగ్ మెయిన్‌రోల్‌లో నటించగా, నాన్న ఫేమ్ చైల్డ్ ఆర్టిస్ట్ సారా అర్జున్ హీరోయిన్‌గా కనిపించింది. మాధవన్, అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి విడుదలైన సినిమా ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈమూవీ ఇప్పటివరకు 148 కోట్లు రాబట్టినట్లు ట్రేడ్ నిపుణులు చెబుతున్నారు.



# ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా సజావుగా జరగాలి, చెక్ లిస్ట్ చూసుకోవాలి

**: జిల్లా కలెక్టర్**

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 10: డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్. గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా లోని రాజంపేట్, దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. మొదటి విడత డిసెంబర్ 11 (రేపు జరిగే ) ఎన్నికల




సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారి అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని ఆన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్త గా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని,విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలలో, తదితర ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, అడ్డంకిలేకుండా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# కత్తెర గుర్తుకు ఓటు వేసి ఇమ్మడి జై కుమార్ ను సర్పంచ్ గా గెలిపించండి

* **పిలుపునిచ్చిన కొమ్ము శ్రీనివాస్ ఎస్సీ సెల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు..**

హైదరాబాద్, డిసెంబర్ 10 (భారత శక్తి) : తెలంగాణలో సర్పంచ్ ఎలక్షన్లో రానే వచ్చాయి వెంకిపల్లి గ్రామంలో ఎలక్షన్ల ప్రచారం జోరుగా నడుస్తున్న వేళ ప్రతి ఓటరు జాగర్తగా గమనించి సరైన వ్యక్తిని ఎన్నుకొని, ఊరును అభివృద్ధి పదంపై నడిపించే బాధ్యత ప్రతి ఓటర్ ది, మనం ఎన్నుకోబోయే అభ్యర్థి రేపు మనల్ని నడిపించే వ్యక్తిగా ఉండాలి మన నెత్తిమీద కూర్చొని ఇబ్బంది పెట్టే వ్యక్తిగా ఉండకూడదు.. ఊరు బాగుంటే దేశం బాగుంటుంది అనే మంచి విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఓటర్ ఆలోచించి ఓటు వేయాలని కొమ్ము శ్రీనివాస్ ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు గ్రామ ప్రజలను ఉద్దేశించి సూచించారు. ఇమ్మడి జై కుమార్ అగ్రవర్ణ వ్యక్తి కావడం అందరిలో ఒక్కడిగా సమాజసేవే








ధ్యేయంగా ప్రతి సేవా కార్యక్రమంలో పాల్గొంటూ సంఘం బాగుంటే అందరూ బాగుంటారు ఊరు బాగుంటే దేశం బాగుంటుంది అనే దృక్పథంతో బ్రహ్మం ఒకటే అనే తత్వంతో అందరిలో ఒక్కడిగా మెలగడం ఆయన గొప్ప స్వభావం.. ఇలాంటి వ్యక్తిని మన ఊరు సర్పంచిగా ఎన్నుకుంటే మన ఊరికి పెద్ద కొడుకుల కాపాడుకుంటాడు అన్ని తానై నడిపిస్తాడు ఓటర్ మహాశయులు.. ఈ విషయాన్ని గ్రహించి తమ ఓటును ఇమ్మడి జై కుమార్కు వేసి గెలిపించాలని కొమ్ము శ్రీనివాస్ ఎస్టీ సెల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోరారు.. వెంకేపల్లి గ్రామం, నూతనకల్ మండలం, సూర్యాపేట జిల్లా, వెంకీ పల్లి గ్రామం ప్రజలు తమ ఓటు హక్కును సరైన వ్యక్తికి వేసి ఉరిని కాపాడాలని మనస్ఫూర్తిగా ఆయన కోరుకున్నారు.

# నగర సమస్యలను పరిష్కరించాలి

* **మున్సిపల్ కమిషనర్ న కలిసిన నగర కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల**

కరీంనగర్,డిసెంబర్ 10(భారతశక్తి ప్రతినిధి): మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నీ నగర కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా అంజన్ కుమార్ సమస్యలపై కమిషనర్ కు విన్నవించారు. కరీంనగర్ పట్టణంలో సీఎం అస్సూరెన్స్ కింద హడావుడిగా ప్రారంభించిన పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తుచేశారు. అర్ధాంతరంగా నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లాడి వీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పడం జరిగింది. అదేవిధంగా కరీంనగర్ పట్టణంలో ఉన్నటువంటి వీధి దీపాలు, స్మార్ట్ సిటీ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పని కాలం ముగిసినందునీ చెప్పారు. అన్ని వసతులతో కొత్త లైట్లు ఏర్పాటు చేస్తామని



కమిషనర్ చెప్పడం జరిగిందన్నారు. కరీంనగర్ పట్టణంలోనీ నిరుపేదలకు డబుల్ రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ జాబితా ప్రకారంగా అందజేయాలన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోనీ మల్లాపూర్ నుంచి బొమ్మకల్ డి94 కాలువలో మురుగు నీళ్లు, సిల్టు తొలగించాలని కోరారు. డంప్ యార్డ్ సమస్యను తీవ్రంగా ఉందని పరిష్కరించాలని కోరారు. కమిషనర్ ను కలిసిన మాజీ కార్పొరేటర్లు బుచ్చిరెడ్డి, సరిల్ల ప్రసాద్, పలిశెట్టి భూమయ్య, కాంగ్రెస్ నాయకులు వీర దేవేందర్ పటేల్ తదితరులు ఉన్నారు.

# భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్
# ఘన విజయం తో తెలంగాణ బ్రాండ్‌కు కొత్త ఊపు

* **పెట్టుబడుల 'వెల్లువ'తో కొత్త శకానికి నాంది పలికిందన్న టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**
* **మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తో కలిసి గ్లోబల్ సమ్మిట్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**

సంగారెడ్డి, డిసెంబర్ 10 (భారత శక్తి ప్రతినిధి) : రెండు రోజుల ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 హైదరాబాద్ శివార్లలోని 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో విజయవంతంగా ముగిసింది. చివరి రోజు రాత్రి జరిగిన ఈవెంట్‌లు, సాంస్కృతిక ప్రదర్శనలు మరియు గిన్నిస్ వరల్డ్ రికార్డు బ్రేకింగ్ డ్రోన్ షోతో సదస్సు ముగింపు ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగాయి. ఈ సమ్మిట్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ఐటీ,



ఇంధనం, ఆరోగ్యం వంటి కీలక రంగాలపై 27 సెషన్‌లు జరిగాయి, ఇందులో ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు ప్రపంచ బ్యాంక్ వంటి ప్రధాన సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సమ్మిట్ ముగింపులో "తెలంగాణ రైజింగ్ 2047" విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కలిసి టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావడం పై నిర్మలా జగ్గారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సమ్మిట్ విజయవంతంగా ముగియడంతో, తెలంగాణ ప్రపంచ పెట్టుబడి మరియు ఆవిష్కరణల కేంద్రంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకుందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమ్మిట్ తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ను పెంచిందన్నారు.




# తెలంగాణలో తొలిసారిగా
## జెన్‌జీ థీమ్ తపాలా కార్యాలయం ప్రారంభం

వరంగల్ డిసెంబర్ 10 (భారత శక్తి ప్రతినిధి) : వరంగల్‌లోని ఎన్ఐటీలో విద్యార్థుల కోసం బుధవారం తపాలాశాఖ హైదరాబాద్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ సుమిత అయోధ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా జెన్‌జీ థీమ్ తపాలా కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నిట్ డైరెక్టర్ ఆచార్య బిద్యాధర్ సబూధి కార్యాలయాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు అధునాతన, వేగవంతమైన సేవలందించేందుకు ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సుమిత అయోధ్య మాట్లాడుతూ.. బ్యాంకింగ్ సేవలు, పార్సిల్ బుకింగ్, క్యూఆర్ ఆధారిత చెల్లింపులు, బీమా, ఆధార్, విద్యార్థులకు ప్రత్యేక రాయితీతో స్పీడ్ పోస్ట్ వంటి విభిన్న సేవలతో పాటు ఉచిత వైఫై సౌకర్యం కల్పించామన్నారు. ఆచార్యులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉద్యోగుల పిల్లలకు ఆచార్య బిద్యాధర్ సబూధి కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సునీల్‌కుమార్ మెహతా, హనుమకొండ తపాలా కార్యాలయ సూపరింటెండెంట్ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

హైదరాబాద్, డిసెంబర్ 10 (భారతశక్తి ప్రతినిధి): తెలంగాణలో గురువారం జరిగే మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 3,800కు పైగా పంచాయతీల్లో ఎన్నికలు జరగనుండగా.. 3వేల పంచాయతీల్లో పోలింగ్‌ను నేరుగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్టు చెప్పారు. బందోబస్తులో సివిల్, ఆర్మ్‌డ్




రిజర్వు, ఇతర స్పెషల్ పోలీస్ సిబ్బంది కూడా పాల్గొంటారని తెలిపారు. సాధారణ పోలింగ్ కేంద్రాలతో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది పూర్తి స్థాయి విధుల్లో ఉంటారన్నారు. ఇప్పటి వరకు రూ.8.20 కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువుల స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. 54 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులు 24 గంటలూ పనిచేస్తున్నాయన్నారు. ప్రజలంతా తనిఖీలకు సహకరించి.. ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

# రైతు వేదిక, స్మశాన వాటిక నిధులన్నీ మోదీ ఇచ్చినవే

* **గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది "గాడిద గుడ్డు"**
* **బీజేపీ బలపర్చిన అభ్యర్థులకే ఓటేసి గెలిపించండి**
* **ఓటేసే ముందు ఒక్కసారి ఆలోచించండి**
* **గ్రామీణ ఓటర్లకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు**

కరీంనగర్, డిసెంబర్ 10 (భారతశక్తి ప్రతినిధి): గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఓటేసే ముందు ఒక్క క్షణం ఆలోచించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పల్లె ప్రగతికి పాటుపడుతోంది... పైసలిస్తోంది మోదీ ప్రభుత్వమేనని, గ్రామాల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతో చేపట్టినవేనని స్పష్టం చేశారు. రైతు వేదిక నుండి స్మశాన వాటిక దాకా, రోడ్ల నిర్మాణం మొదలు వీధి దీపాల దాకా ఆఖరికి గ్రామాల్లో జరిగే పారిశుధ్య పనులకు సైతం కేంద్ర నిధులే వెచ్చిస్తున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి గత 2 ఏళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది ''గాడిద గుడ్డు'' మాత్రమేనని విమర్శించారు. పచ్చని పల్లెలలకు పైసా ఇయ్యకుండా, చేసిన పనులకు బిల్లులియ్యకుండా సర్పంచులు ఆత్మహత్య చేసుకునే దుస్థితికి తెచ్చింది బీఆర్ఎస్సేనని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి పైసలిస్తున్న బీజేపీ బలపర్చిన అభ్యర్థులకే ఓటేసి గెలిపించి గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుని ఆదర్శంగా తీర్చిదిద్దుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పచ్చని పల్లెలకు పైసా ఇయ్యకుండా చిచ్చు పెడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు బుద్ది చెప్పాలంటే... ఆ పార్టీలు బలపర్చిన అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ''దేశాభివృద్ధికి గ్రామాలే మూల స్తంభాలు. గ్రామాలను అభివృద్ధి చేస్తేనే ఈ దేశం అభివృద్ధి చెందుతుందని నమ్మి మనస్ఫూర్తిగా ఆచరిస్తున్న మహానేత మన ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీని బలపర్చి వికసిత్ భారత్ లక్ష్యాల్లో భాగస్వాములు కావాలని కోరారు. మరికొన్ని గంటల్లో పంచాయతీ ఎన్నికల తొలి దశ పోలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులతోపాటు తాను కృషిని వివరిస్తూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యాంశాలు...

* మన గ్రామం అభివృద్ధికి మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధుల వివరాలు...
* రైతు వేదిక నిర్మాణానికి రూ.10



లక్షలు ఇచ్చింది.
* పల్లె ప్రకృతి వనానికి రూ. 4 లక్షల 23 వేలు ఖర్చు చేసింది.
* స్మశాన వాటిక నిర్మాణానికి రూ.11 లక్షల 13 వేలు చెల్లించింది.
* డంపింగ్ యార్డ్ నిర్మాణానికి రూ.2 లక్షల 50 వేలు ఇచ్చింది.
* నర్సరీలకు రూ.1 లక్షా 56 వేలు ఇచ్చింది.
* ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.12 లక్షలు చెల్లించింది.
* ఇంటింటికీ మరుగుదొడ్డి కోసం... రూ.12 వేలు ఇచ్చింది.

# అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్... సీఎం చంద్రబాబు వినూత్న నిర్ణయం

అమరావతి, డిసెంబర్ 10 (భారతశక్తి ప్రతినిధి): రాష్ట్రంలో రైతులపై సాగు వ్యయ భారాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తూ, ఆధునిక యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు 'అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి, మిర్చి సహా వాణిజ్య పంటల కొనుగోళ్లపై బుధవారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. శాస్త్రీయ విధానంలో పంటల ప్రణాళిక, ఆధునిక యంత్రాలు, డ్రోన్ల వినియోగం ద్వారా సాగు ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించి, అందులో అందుబాటులో ఉన్న పరికరాల వివరాలను పొందుపరచాలని సూచించారు. ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు ఉండాలని, వరికి ప్రత్యామ్నాయంగా రాగులు, జొన్నలు, సజ్జల వంటి చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు.

**ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష**

202526 ఆర్థిక సంవత్సరానికి గాను 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు సీఎంకు వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 2,606 కొనుగోలు కేంద్రాల ద్వారా 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. రైతులకు 7.39 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రూ.4,085 కోట్లు చెల్లించామని వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 32 శాతం అధికమని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఎం, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఎన్డీఏ ప్రజాప్రతినిధులంతా కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు భరోసా ఇవ్వాలని సూచించారు. రబీ సీజన్‌లో ప్రజలు తినే వరి రకాల సాగుతో పాటు వాటి కొనుగోలు, అంతర్జాతీయ మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు.

**సీసీఐ తీరుపై సీఎం అసహనం**

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ల కేటాయింపులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసే విషయంలో అనవసర ఇబ్బందులు సృష్టించవద్దని హెచ్చరించారు. ఈ సమస్యలపై వెంటనే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సూచించారు.

**వాణిజ్య, ఉద్యాన పంటలపై దృష్టి**

మిర్చి వంటి పంటలకు మెరుగైన మార్కెట్ కల్పించేందుకు విశ్లేషణా సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సీఎం అన్నారు. ధరలు ఒక్కసారిగా పడిపోకుండా వాణిజ్య పంటల హార్వెస్టింగ్ ప్రక్రియలో 'రేషనలైజేషన్' విధానాన్ని పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీనివల్ల దశలవారీగా పంట మార్కెట్‌కు వచ్చి గిట్టుబాటు ధర లభిస్తుందని వివరించారు. అరటి, నిమ్మ వంటి ఉద్యాన పంటల కొనుగోలుదారులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో 45,420 హెక్టార్లలో సాగవుతున్న సుబాబుల్ రైతులకు మార్కెట్‌కు అనుగుణంగా ధర దక్కేలా చూడాలన్నారు. రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లి పంటకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమీర్‌పేట కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

హైదరాబాద్, డిసెంబర్ 10 (భారతశక్తి ప్రతినిధి): హైదరాబాద్ నగరంలోని అమీర్‌పేట మైత్రీవనంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఈ ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో విద్యార్థులందరూ సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే... మైత్రీవనంలోని శివమ్ టెక్నాలజీస్ అనే కోచింగ్ సెంటర్‌లో ఉదయం 10 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బ్యాటరీలు పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. మంటలు, దట్టమైన పొగలు వ్యాపించడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టి, సెంటర్‌లోని విద్యార్థులందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వందలాది కోచింగ్ సెంటర్లకు నిలయమైన అమీర్‌పేటలో ఈ ప్రమాదం జరగడం ఆందోళనకు గురిచేసింది.

# మోదీ, రాహుల్ గాంధీ మధ్య 88 నిమిషాల భేటీ

ఢిల్లీ, డిసెంబర్ 10 (భారతశక్తి ప్రతినిధి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య ఈరోజు జరిగిన సమావేశం పార్లమెంట్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేపింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా జరిగిన ఈ భేటీ ఏకంగా 88 నిమిషాల పాటు కొనసాగడం ఊహాగానాలకు తావిచ్చింది. వాస్తవానికి, ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) నియామకంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ, ఇది ఇంత సుదీర్ఘంగా సాగుతుందని ఎవరూ ఊహించలేదు. నిబంధనల ప్రకారం, సమాచార కమిషన్, ఎన్నికల కమిషన్, విజిలెన్స్ విభాగాల్లో కీలక నియామకాలపై ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాని నామినేట్ చేసిన ఒక కేంద్ర మంత్రి కలిసి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రధాని కార్యాలయానికి రాహుల్ చేరుకోగా... 1.07 గంటలకు భేటీ ప్రారంభమైంది. అయితే, సమయం గడిచేకొద్దీ సమావేశం అజెండాపై ఎంపీల్లో చర్చ మొదలైంది. అనంతరం, ఈ భేటీలో కేవలం సీఐసీ నియామకం గురించే కాకుండా, మరో 8 మంది సమాచార కమిషనర్లు, ఒక విజిలెన్స్ కమిషనర్ నియామకాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. అయితే, ఈ నియామకాలన్నింటికీ రాహుల్ గాంధీ తన అభ్యంతరాన్ని వ్యక్తం చేశారని, దానిని లిఖితపూర్వకంగా కూడా సమర్పించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గతంలో ఇలాంటి సమావేశాల్లో ప్రతిపక్ష నేతలు అభ్యంతరాలు తెలపడం సాధారణమే అయినా, ఈసారి భేటీ సుదీర్ఘంగా జరగడమే చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం కేంద్ర సమాచార కమిషన్‌లో సీఐసీతో సహా 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సెప్టెంబర్ 13న హీరాలాల్ సమారియా పదవీ విరమణ చేసినప్పటి నుంచి సీఐసీ పదవి ఖాళీగా ఉంది. కమిషన్‌లో దాదాపు 30,838 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

# స్టార్టప్‌లకు రూ.1000 కోట్లు... సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన

హైదరాబాద్, డిసెంబర్ 10 (భారతశక్తి ప్రతినిధి): తెలంగాణలోని స్టార్టప్‌లకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రోత్సాహాన్ని ప్రకటించింది. స్టార్టప్‌ల అభివృద్ధి కోసం రూ.1,000 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ నిధిని సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తులో గూగుల్ వంటి పెద్ద సంస్థలుగా ఎదగాలని ఆయన స్టార్టప్‌లకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని టీహబ్‌లో ఏర్పాటు చేసిన 'గూగుల్ ఫర్ స్టార్టప్' హబ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో స్టార్టప్‌ల వృద్ధికి అనువైన వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "1998లో ఇద్దరు స్నేహితులు కాలిఫోర్నియాలోని ఓ గ్యారేజ్‌లో ప్రారంభించిన స్టార్టప్, ఈరోజు ప్రపంచ దిగ్గజం గూగుల్‌గా నిలిచింది. అదే స్ఫూర్తితో మన స్టార్టప్‌లు కూడా ఎదగాలి" అని ఆయన అన్నారు. ప్రొడక్ట్ ఆధారిత, వినూత్నమైన స్టార్టప్‌లపై యువత దృష్టి సారించాలని సీఎం సూచించారు. గూగుల్, యాపిల్, అమెజాన్ వంటి సంస్థలు 20 ఏళ్ల క్రితం చిన్న స్టార్టప్‌లుగా మొదలై ఇప్పుడు బిలియన్ డాలర్ల కంపెనీలుగా మారాయని గుర్తుచేశారు. "హైదరాబాద్ కేవలం స్టార్టప్ హబ్‌గా మిగిలిపోకూడదు. ఇక్కడి నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంలో స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఈ హబ్ ఏర్పాటుతో రాష్ట్రంలో ఆవిష్కరణల వాతావరణం మరింత బలపడుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ సంయుక్తంగా ఏఐ ఆధారిత స్టార్టప్‌లకు ప్రోత్సాహం, ప్రతిభను వెలికితీయడం, అంతర్జాతీయ మార్కెట్లకు అనుసంధానం చేయడం వంటి అంశాలపై పనిచేయనున్నాయి.


# తిరుమలలో మరో భారీ స్కామ్..
# పట్టు శాలువాల పేరుతో పాలిస్టర్ దందా

తిరుమల, డిసెంబర్ 10 (భారతశక్తి ప్రతినిధి): కలియుగ దైవం తిరుమల శ్రీవారి సన్నిధిలో వరుస కుంభకోణాలు బయటపడటం భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పరకామణిలో చోరీ, కల్తీ నెయ్యి సరఫరా వంటి ఘటనలు మరువక ముందే ఇప్పుడు పట్టు శాలువాల కొనుగోళ్లలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. శ్రీవారికి విరాళాలు ఇచ్చే దాతలు, వీఐపీలకు అందించే మల్బరీ పట్టు శాలువాలకు బదులుగా, ఓ సంస్థ పదేళ్లుగా 100 శాతం పాలిస్టర్ శాలువాలను సరఫరా చేసినట్లు టీటీడీ విజిలెన్స్ తనిఖీల్లో తేలింది. వివరాల్లోకి వెళితే.. శ్రీవారిని దర్శించుకునే దాతలు, వీఐపీలకు రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించి, పట్టు శాలువాతో సత్కరించడం ఆనవాయతీ. దీని కోసం టీటీడీ ఏటా కోట్ల రూపాయలు వెచ్చించి పట్టు శాలువాలను కొనుగోలు చేస్తుంది. అయితే, నగరికి చెందిన వీఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్ అనే సంస్థ 2015 నుంచి టెండర్ దక్కించుకుని శాలువాలు సరఫరా చేస్తోంది. ఇటీవల టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు ఈ శాలువాల నాణ్యతపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టెండర్ నిబంధనల ప్రకారం స్వచ్ఛమైన మల్బరీ పట్టుతో, నిర్దిష్టమైన బరువు, పరిమాణంలో శాలువాలు నేయాలి. వాటిపై 'ఓం నమో వేంకటేశాయ' అనే అక్షరాలతో పాటు శంకు, చక్ర నామాలు ఉండాలి. కానీ, సరఫరా అయిన శాలువాలు పూర్తి పాలిస్టర్‌తో ఉన్నాయని తేలింది. కేవలం రూ.350 నుంచి రూ.400 విలువ చేసే ఈ నాసిరకం శాలువాలను ఒక్కొక్కటి రూ.1,389 చొప్పున టీటీడీకి విక్రయించి సంస్థ మోసానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఈ శాలువాల నమూనాలను బెంగళూరు, ధర్మవరంలోని సెంట్రల్ సిల్క్ బోర్డ్ ల్యాబ్‌లకు పంపించగా, అవి పాలిస్టర్‌తో తయారైనవేనని నివేదికలు స్పష్టం చేశాయి. ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని టీటీడీ పాలకమండలి తీర్మానం చేసింది. దీనిపై దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్ జనరల్‌ను కోరింది. గతంలో కాంచీపురంలోని ల్యాబ్‌లో పరీక్షించినప్పుడు నమూనాలను మార్పిడి చేసి ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# యునెస్కో వారసత్వ పండుగగా 'దీపావళి'.. ప్రధాని మోదీ హర్షం

ఢిల్లీ, డిసెంబర్ 10 (భారతశక్తి ప్రతినిధి): భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగకు ప్రపంచ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. యునెస్కో తన 'మానవ సంస్కృతికి చెందిన వారసత్వ జాబితా'లో దీపావళిని చేర్చినట్లు బుధవారం ప్రకటించింది. ఈ నిర్ణయం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో స్పందిస్తూ.. "భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు ఈ వార్తతో పులకించిపోతున్నారు. దీపావళి మన సంస్కృతి, విలువలతో పెనవేసుకుపోయింది. ఇది మన నాగరికతకు ఆత్మ లాంటిది. ఈ గుర్తింపుతో దీపావళి ప్రాముఖ్యత ప్రపంచవ్యాప్తంగా మరింత పెరుగుతుంది. శ్రీరాముడి ఆదర్శాలు మనందరినీ ఎల్లప్పుడూ నడిపించాలి" అని పేర్కొన్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా స్పందిస్తూ, ఇది భారత్‌కు చారిత్రక దినమని అభివర్ణించారు. ప్రధాని మోదీ హయాంలో భారత సాంస్కృతిక వారసత్వానికి అపూర్వమైన అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని ఆయన అన్నారు. మొట్టమొదటిసారిగా భారత్ ఆతిథ్యమిస్తున్న యునెస్కో 20వ అంతర్ ప్రభుత్వ కమిటీ సమావేశాలు ఈ నెల 8 నుంచి 13 వరకు ఢిల్లీలోని ఎర్రకోటలో జరుగుతున్నాయి. ఈ సమావేశాల్లోనే దాదాపు 80 దేశాలు సమర్పించిన 67 ప్రతిపాదనలను పరిశీలించి, దీపావళికి ఈ గుర్తింపునిస్తున్నట్లు యునెస్కో ప్రకటించింది. ఇప్పటివరకు ఈ జాబితాలో కుంభమేళా, దుర్గాపూజ, గుజరాత్ గర్బా, యోగా సహా 15 భారతీయ అంశాలు ఉండగా, తాజాగా దీపావళి చేరికతో ఈ సంఖ్య 16కి పెరిగింది.

# వాళ్లకే జన్మతః పౌరసత్వం..
## ధనిక వలసదారులకు కాదు: డొనాల్డ్ ట్రంప్




అమెరికా, డిసెంబర్ 10: అమెరికాలో జన్మతః పౌరసత్వం (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) అనేది బానిసల పిల్లల కోసం ఉద్దేశించిందే తప్ప, ఇతర దేశాల నుంచి వచ్చే ధనిక వలసదారులు తమ కుటుంబం మొత్తానికి పౌరసత్వం కల్పించుకోవడానికి కాదని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వివాదంపై సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించిన కొద్ది రోజులకే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికన్ న్యూస్ అవుట్‌లెట్ పొలిటికోతో మాట్లాడుతూ, తన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను ట్రంప్ సమర్థించుకున్నారు. "చారిత్రకంగా చూస్తే ఈ కేసు అంతర్యుద్ధం సమయంలో బానిసల పిల్లలకు సంబంధించినది. అంతేగానీ, ఏదో ఒక ధనిక దేశం నుంచి వచ్చిన వ్యక్తి మన దేశంలో అడుగుపెట్టి, వారి కుటుంబం మొత్తాన్ని అమెరికా పౌరులుగా మార్చడానికి కాదు. ఈ విషయాన్ని ఇప్పుడు ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. సుప్రీంకోర్టులో ఈ కేసులో ఓడిపోతే అది దేశానికి వినాశకరం అవుతుంది" అని ఆయన హెచ్చరించారు. జనవరి 2025లో, అక్రమ వలసదారులు మరియు తాత్కాలిక వీసాలపై ఉన్నవారికి అమెరికాలో పుట్టిన పిల్లలకు పౌరసత్వం గుర్తించడాన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై పలు ఫెడరల్ కోర్టులు స్టే విధించడంతో, ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. డిసెంబర్ 5న ఈ అప్పీల్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం, వచ్చే వేసవిలో తీర్పు వెలువరించే అవకాశం ఉంది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం, దేశ సరిహద్దుల్లో పుట్టిన వారికి పౌరసత్వం లభిస్తుంది. అయితే, ఆ తల్లిదండ్రులు 'అమెరికా అధికార పరిధికి లోబడి' ఉండాలన్న నిబంధనపైనే ప్రస్తుతం భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# భారతీయ టెక్కీలకు కొత్త కష్టాలు..
# హెచ్–1బీ వీసా అపాయింట్‌మెంట్లు వాయిదా

అమెరికా, డిసెంబర్ 10: అమెరికా వెళ్లాలనుకునే భారతీయ హెచ్ 1బీ వీసా దరఖాస్తుదారులకు ఊహించని అడ్డంకి ఎదురైంది. అమెరికా ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన సోషల్ మీడియా తనిఖీల విధానం కారణంగా, భారత్‌లో అనేక వీసా అపాయింట్‌మెంట్లు వచ్చే ఏడాదికి వాయిదా పడ్డాయి. ఈ మార్పులపై భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం మంగళవారం రాత్రి దరఖాస్తుదారులకు కీలక సూచనలు జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్ తేదీ మార్చబడినట్లు మీకు ఈమెయిల్ వచ్చి ఉంటే, కొత్త తేదీలో మాత్రమే హాజరు కావాలని రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఒకవేళ ఎవరైనా పాత తేదీలో ఇంటర్వ్యూ కోసం వస్తే, వారిని కాన్సులేట్‌లోకి అనుమతించబోమని హెచ్చరించింది. బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం డిసెంబర్ మధ్య నుంచి చివరి వరకు జరగాల్సిన అనేక ఇంటర్వ్యూలు వచ్చే ఏడాది మార్చి నెలకు మార్చబడ్డాయి. కొత్త నిబంధనల ప్రకారం హెచ్ 1బీ, హెచ్ 4 వీసా దరఖాస్తుదారులు తమ సోషల్ మీడియా ప్రొఫైల్స్ ప్రైవసీ సెట్టింగులను 'పబ్లిక్'గా మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 15 నుంచి అధికారులు వారి ఆన్‌లైన్ కార్యకలాపాలను సమీక్షించి, జాతీయ భద్రతకు ముప్పు కలిగించే వారిని గుర్తిస్తారు. "ప్రతి వీసా మంజూరు ప్రక్రియ ఒక జాతీయ భద్రతా నిర్ణయం" అని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హెచ్ 1బీ వీసా ప్రోగ్రామ్‌పై నిఘా పెరిగింది. నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులకు ప్రాథమిక మార్గమైన ఈ వీసాపై ఇప్పటికే అనేక ఆంక్షలు విధించారు. గతంలో హెచ్ 1బీ వీసాలపై 100,000 డాలర్ల రుసుము విధించడం, 19 దేశాల నుంచి గ్రీన్ కార్డ్ దరఖాస్తులను నిలిపివేయడం వంటి చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.

# రెండు నెలల పాటు పర్వదినాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు: తితిదే




తిరుమల, డిసెంబర్ 10 (భారతశక్తి ప్రతినిధి): డిసెంబరు, వచ్చే ఏడాది జనవరిలో తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించనున్న పలు పర్వదినాల నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను ఆయా రోజుల్లో రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ప్రకటించింది. శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23న (కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం), 29న (వైకుంఠ ఏకాదశి ముందు రోజు), డిసెంబరు 30 నుంచి జనవరి 8 వరకు (వైకుంఠ ద్వార దర్శనాలు), జనవరి 25 (రథ సప్తమి) కారణంగా ఈ పర్వదినాల్లో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు తితిదే ప్రకటనలో పేర్కొంది. పర్వదినాలకు ముందురోజు వీఐపీ దర్శనాలకు సంబంధించి ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని శ్రీవారి భక్తులు దేవస్థానం సిబ్బందికి సహకరించాలని కోరింది.

# నగర శివారు ప్రాంతాల్లో ఇళ్ళు కట్టుకుంటున్నారా..?

- మీకోసం జీ.హెచ్.ఎం.సి. శుభవార్త చెప్పింది..
- ఈ కీలక నిర్ణయం తగినంత ఫలితం ఇస్తుందా..?
- బిల్డ్ నౌ సాఫ్ట్ వేర్ లో కీలక మార్పులకు శ్రీకారం.. ..
- ప్రస్తుతం శివారు ప్రాంతాల్లో జీ ప్లస్ 2 వరకు అనుమతులు..
- మరిన్ని అంతస్తులకు కూడా అనుమతులు ఇచ్చే ఆలోచన..
- మూడు రోజుల క్రితమే మొదలైన దరఖాస్తుల ప్రక్రియ..
- ఇది తీపి కబురే అంటున్న కొందరు.. కాదంటున్న మరికొందరు..
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నిలిచిపోయిన నిర్మాణ అనుమతులు..
- జీ.హెచ్.ఎం.సి.లో విలీనం అవడంతో పునరుద్ధరణ పనులకు శ్రీకారం..
- ప్రజలకు కలిగిన అసౌకర్యాన్ని తొలగించే ప్రక్రియ చేపట్టామన్న అధికారులు..
- బిల్డ్ నౌ సాఫ్ట్ వేర్ మార్పులపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..




(స్పెషల్ కరస్పాండెంట్)

**హైదరాబాద్, డిసెంబర్ 11 (భారత శక్తి ) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శివారు ప్రాంతాల్లో నిర్మాణ అనుమతుల ప్రక్రియను పునరుద్ధరించింది. 'బిల్డ్‌నౌ' సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి.. దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించింది.. ప్రస్తుతం జీ ప్లస్ 2 వరకు అనుమతులు ఇవ్వనుండగా.. మరిన్ని అంతస్తుల నిర్మాణ అనుమతులకు సాఫ్ట్‌వేర్ మార్పులు జరుగుతున్నాయని తెలుస్తోంది..

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని ప్రజలకు, నిర్మాణదారులకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తీపి కబురు అందించింది. జీహెచ్‌ఎంసీలో విలీనమైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నిలిచిపోయిన నిర్మాణ అనుమతుల ప్రక్రియను పునరుద్ధరించేందుకు బల్దియా సన్నాహాలు చేసింది. ఇప్పటి వరకు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా ఉన్న పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్‌ఎంసీలో భాగం చేస్తూ 'బిల్డ్‌నౌ' సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేశారు. ఈ మార్పుల కారణంగా.. నిర్మాణ అనుమతుల దరఖాస్తుల ప్రక్రియ అందుబాటులోకి తీసుకుని వచ్చామని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

ప్రస్తుతానికి జీ ప్లస్ 2 అంటే గ్రౌండ్ ప్లస్ రెండు అంతస్తులు.. వరకు ఉన్న భవనాలకు మాత్రమే అనుమతులు ఇవ్వనున్నారు. ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్‌లో 75 చదరపు గజాల్లోపు భూములకు స్టిల్ట్ ప్లస్ 2 లేదా జి ప్లస్ 1 అనుమతి మంజూరు చేస్తారు. ఇన్‌స్టంట్ అప్రూవల్ కింద 75 నుంచి 1000 చదరపు గజాల్లోపు స్థలాల్లో స్టిల్ట్ ప్లస్ 5 నిర్మాణానికి అనుమతి ఇవ్వనున్నారు. అంతకుమించి ఎక్కువ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ మార్పులు ఇంకా జరుగుతున్నాయి కాబట్టి, వాటి అనుమతులు మంజూరు కావడానికి మరికొన్ని రోజులు వేచి చూడాల్సి ఉంటుంది.

బహుళ అంతస్తులు, ఆకాశహర్మ్యాల కోసం పార్కింగ్ స్థలం, ఖాళీ స్థలం వంటి నిబంధనలలో మార్పులు వుండబోతున్నాయని తెలుస్తోంది.. శివారు సర్కిళ్లలో జీహెచ్‌ఎంసీ నిబంధనల ప్రకారం అనుమతులు జారీ అయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను సవరించాక ఆయా దరఖాస్తులను పునరుద్ధరిస్తారని అధికారులు తెలియజేశారు..

ఇక రుసుము చెల్లింపుతో ముడిపడిన అన్ని రకాల పౌర సేవలు ప్రస్తుతం నిలిచిపోయాయి. వాటన్నింటినీ నిన్నటి నుండి అంతే సోమవారం నుండి పునరుద్ధరించి, ప్రజలకు అసౌకర్యాన్ని తొలగించామని పరిపాలన విభాగం ప్రకటించింది. విలీనమైన మున్సిపాలిటీల పరిధిలో గతంలో ఆయా మున్సిపల్ కమిషనర్ ఖాతాలకు చేరే భవన నిర్మాణ రుసుములు, జనన/మరణ ధ్రువపత్రాల రుసుములు, ఆస్తిపన్ను, ఎస్టేట్స్, ఇతర రుసుములన్నీ ఇకపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఖాతాకు చేరేలా చర్యలు చేపట్టారు.

హెచ్‌ఎండీఏ పరిధిలో ప్రస్తుతం వందలాది ఆకాశహర్మ్యాల భవనాల అనుమతి దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ నిబంధనలకు మధ్య చాలా వ్యత్యాసం ఉన్నందున గ్రేటర్ విలీనం నేపథ్యంలో ఈ దరఖాస్తులను ఏ నిబంధనల ప్రకారం ఆమోదించాలనే అంశంపై అధికారులు ప్రస్తుతం తర్జనభర్జన పడుతున్నారు. ఈ విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.



## వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

**: జడ్జి హిమబిందు**

ఎల్బీనగర్, డిసెంబర్ 10 (భారత శక్తి): న్యాయ శాస్త్రం అభ్యసించిన విద్యార్థులు భవిష్యత్తులో తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఇబ్రహీంపట్నం ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం. హిమబిందు అన్నారు. చైతన్యపురిలోని తెలంగాణ గురుకుల మహిళ న్యాయ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మానస ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడారు.తమ ఉపన్యాసంతో న్యాయ విద్యార్థులకు మానవహక్కుల ప్రాధాన్యత న్యాయపరంగా ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చునని వివరించారు. మానవ హక్కుల గురించి విద్యార్థులు స్కిట్లు, పాటలు, నృత్య ప్రదర్శన చేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి. కవిత, కే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను నాలుగు డివిజన్లుగా విభజించాలి రామిడి రామిరెడ్డి

బడంగ్ పేట్, డిసెంబర్ 10 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 32 డివిజన్లను జిహెచ్ఎంసి విలీన ప్రక్రియపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ, ప్రస్తుత డివిజన్‌ల కేటాయింపు ప్రజలు, ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకోకుండా జరిగిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన 3 డివిజన్లలో ఓటర్ల సంఖ్య ఇలా ఉంది..నాదర్గుల్ డివిజన్ 57- 65,000 ఓటర్లు బడంగ్పేట్ డివిజన్ 61 - 40,000 ఓటర్లు బాలాపూర్ డివిజన్ 62- 30,000 ఓటర్లు..అయితే 65,000 ఓటర్లున్న నాదర్గుల్ డివిజన్‌ను ఒక్క డివిజన్‌గా ఉంచడం అన్యాయం అవుతుందని, ఏ పద్ధతి ఏ నిష్పత్తి ప్రకారంగా విభజించారు అర్థం కాని ప్రశ్నగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.57 వ డివిజన్‌ను రెండు భాగాలుగా విభజించి సమన్యాయం చేయాలని రామిడి రామిరెడ్డి కోరారు.ఈ మేరకు తమ వినతిపత్రాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం



నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దబావి ఆనంద్ రెడ్డి, అర్జున్, వంగేటి లక్ష్మారెడ్డి, ఏనుగు రామిరెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, భీమిడి జంగారెడ్డి, గుండు జి. రఘునందన్ చారి, పెద్దబావి శ్రీనివాసరెడ్డి, సమ్ రెడ్డి వెంకట్ రెడ్డి, తుఫాన్ రెడ్డి, గుర్రం సాయికిరణ్ రెడ్డి, ముత్యం రెడ్డి, సత్తిరెడ్డి, అత్తాపురం శ్రీనివాస్ రెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, సాంబశివ కుమార్ గౌడ్, మున్నా, అరవింద్ గౌడ్, పాండు, హరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అలంకార ప్రియుడికి ఘనంగా అభిషేకం

మణుగూరు, డిసెంబర్ 10 (భారతశక్తి): మున్సిపాలిటీ పరిధిలో స్వయంబుగా వెలసిన శ్రీ నీలకంఠేశ్వర స్వామివారి ఆలయ సమీపంలో గల అయ్యప్పస్వామి శివాలయం పీఠంలో అర్చకులు బాలాజీ శర్మ , గురుస్వాములు విద్యాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అలంకార ప్రియుడికి అష్ఠాదశ ద్రవ్యాలతో ఘనంగా అభిషేకం నిర్వహించారు. ముందుగా నిత్య పూజలో భాగంగా గణపతి, షణ్ముఖ, శ్రీ మణికంఠునికి అష్టోత్తర నామాలతో గురుస్వామి విద్యాసాగర్ రెడ్డి కన్నె స్వామితో పూజలు చేయించారు. అనంతరం అయ్యప్ప స్వామి మాలధరించిన స్వాముల గోత్ర నామాలతో ఆలయ అర్చకులు బాలాజీ శర్మ గౌరమ్మకు, వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామికి ఎంతో ప్రీతికరమైన బుధవారం పర్వదినం పురస్కరించుకుని అయ్యప్ప స్వామిని జలంతో శుద్ధి చేసి వివిధ రకాల పండ్ల రసాలు, అష్టమూలికల తైలం, పన్నీరు, పంచామృతాలతో వేదమంత్రాల నడుమ అభిషేకం నిర్వహించారు. గంగజలం పసుపు, కుంకుమ, గంధం, విభూధితో శుద్ధి చేసిన జలంను దోషాలు తొలగించాలని మాలధరించిన అయ్యప్ప స్వాములపై చల్లి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో శివాలయం పీఠం గురుస్వాములు నుకలపాటి నాగేశ్వరరావు, బోడ బాలాజీ, కృష్ణ, పెరు



స్వాములు కనుకు రమేష్, నరేంద్ర రెడ్డి, కన్నె స్వాములు, కత్తి స్వాములు , గంట స్వాములు పుల్లారావు, గథ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ విజేత గీతం

* **విజేతల బృందానికి 1.5 లక్షల నగదు పురస్కారం**

సంగారెడ్డి, డిసెంబర్ 10 (భారత శక్తి ప్రతినిధి):జాతీయ స్థాయి పోటీలలో గీతం విద్యార్థులు మరోసారి రాణించారు. అహ్మదాబాద్ (గుజరాత్) నోడల్ సెంటర్ లో ఇటీవల జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ఐహెచ్) 2025ను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు జట్టు గెలుచుకుంది. ఆ జట్టు వినూత్న సాంకేతిక పరిష్కారాన్ని మెచ్చిన జ్యూరీ ₹1.5 లక్షల నగదు పురస్కారాన్ని అందజేసి సత్కరించింది.బీటెక్ సీఎస్ఈ & ఏఐఎంఎల్ రెండో యేడాది విద్యార్థులు కె.కృష్ణప్రియ, అబ్దుల్ బాసిత్ హసన్ షేక్, కె.అమోఘ్, కర్మన్ ఘాట్ యశ్వంత్, యుక్త చావలి, శరణ్య మదీనాలతో కూడిన విజేత బృందం - ప్రభుత్వ ఈకన్సల్టేషన్ మాడ్యూల్ ద్వారా సమర్పించే ప్రజా వ్యాఖ్యల యొక్క సెంటిమెంట్ విశ్లేషణ కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత వేదికను అభివృద్ధి చేసింది. విధాన రూపకర్తలు సెంటిమెంట్, విధాన వైఖరిని వర్గీకరించడం, సారాంశాలను రూపొందించడం, సాక్ష్యం ఆధారిత నిర్ణయం తీసుకోవడాన్ని ప్రారంభించడం ద్వారా ముసాయిదా చట్టాలు, నిబంధనలపై పౌరుల అభిప్రాయాన్ని పెద్ద




మొత్తంలో సమర్థవంతంగా విశ్లేషించడానికి ఈ ఏఐ వేదిక సహాయ పడుతుంది.ఈ బృందానికి మార్గదర్శి (మెంటార్)గా వ్యవహరించిన డాక్టర్ చంద్రశేఖర్ ఉద్దగిరి, విద్యార్థుల విజయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 'ఈ అద్భుతమైన బృందానికి మార్గదర్శకత్వం వహించడం చాలా గర్వకారణం. వారి పరిష్కారం, దాని ఆవిష్కరణ, సాధించగల ప్రభావం జ్యూరీని ఆకట్టుకుంది. వారి కృషి, అంకితభావానికి విద్యార్థులందరికీ అభినందనలు' అని ఆయన వ్యాఖ్యానించారు. గీతం హైదరాబాదులోని వెంచర్ డెవలప్ మెంట్ సెంటర్ (వీడీసీ) సహకారానికి డాక్టర్ చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలియజేశారు.విద్యార్థుల ఈ చొరవకు వీడీసీ మద్దతు ఇవ్వడమే గాక, జాతీయ స్థాయి కార్యక్రమంలో విద్యార్థుల బృందం పాల్గొనడానికి సాయపడింది. విశ్వవిద్యాలయ నాయకత్వం నుంచి నిరంతర ప్రోత్సాహాన్ని ఈ సందర్భంగా వీడీసీ గుర్తు చేసుకుంది. తమకు వెన్నుదన్నుగా ఉంటున్న సీఎస్ఈ & ఏఐఎంఎల్ విభాగాధిపతులు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, వీడీసీ డిప్యూటీ డైరెక్టర్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్‌డీన్ లతో పాటు గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి తదితరులకు వీడీసీ కృతజ్ఞతలు తెలియజేసింది. ఆవిష్కరణ, అనుభవపూర్వక అభ్యాసంపై వారి నిరంతర సహకారం, ఈ ప్రతిష్టాత్మక జాతీయ విజయంలో కీలక పాత్ర పోషించినట్టు వీడీసీ తెలియజేసింది.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.